




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY









సంపుటి 10 | సంచిక 34 | కర్నూలు | బుధవారం 26 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

**వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం**
**సకాలంలో పెన్షన్లు, జీతాలు చెల్లిస్తున్నాం**
**త్వరలోనే డిఎస్సీ కూడా నిర్వహిస్తాం**
**గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో సిఎం చంద్రబాబు**



అమరావతి,ఫిబ్రవరి25((శ్రీచక్ర) : ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. తల్లికి వందనం సహా.. అనేక పథకాల అమలును ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. తల్లికి వందనం పథకం అమలు వ్యవహారంపై మాట్లాడిన సీఎం.. ఈ పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. పథకాన్ని అమలు చేస్తామన్నారు. మే నెలలో ఈ పథకం డబ్బులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. రైతుకు భరోసా కల్పించే విషయంలో తాము చెప్పినట్లుగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు సీఎం. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కేంద్రం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి యోజన రూ. 6000, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14 వేలు కలిపి మొత్తం రూ. 20వేలు ఇస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి మరోసారి ఉద్ఘాటించారు. ఇక దివ్యాంగులకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు పింఛను పెంచామన్నారు. సాధారణ పింఛన్‌ను రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచామన్నారు. రూ. 33 వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం పింఛన్లు ఇచ్చే దేశంలోనే ఏకైక కార్యక్రమం ఇది అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికీ సమయానికి జీతాలు ఇస్తున్నామని, ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నామని సీఎం చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. అన్న క్యాంటిన్లు మూసేశారని.. ఇప్పుడు తాము తిరిగి ప్రారంభించామన్నారు. పేదలకు దీపం కార్యక్రమం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చామని.. ఆ హామీని అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా 93 లక్షల మందికి దీపం 2 అందుతోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి డీఎస్సీ సెలక్షన్ పూర్తి చేసి బడులు తెరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక మత్స్యకారులకు సైతం అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు రూ. 20 వేలు ఇస్తామన్నారు. ప్రతి సంవత్సరం వారికి హాలిడే ఇస్తామని.. ఆ హాలిడే కంటే ముందుగానే ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామన్నారు. వైకాపా హయాంలో జరిగిన సభ కౌరవ సభ. కౌరవసభను గౌరవసభ చేశాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశా. గౌరవసభను అవమానించే పార్టీ ఇవాళ అసెంబ్లీలో లేకుండా పోయింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఎప్పుడూ చూడలేదు. సంప్రదాయాలను మరిచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజసమా? ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది మేం కాదు.. ప్రజలు. నిన్న వైకాపా నేతలు కేవలం 11 నిమిషాలే సభలో ఉన్నారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం మేం కలిసి పోటీ చేయలేదు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతోనే కలిసి పోటీ చేశాం. వైకాపా పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైంది. డబుల్ ఇంజిన్ సర్కార్ లేకుంటే రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయలేమని భావించాం. రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు 16,384 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. ఎంత మంది పిల్లలున్నా అందరికీ అమలు చేస్తాం. కేంద్ర పథకాలకు ఇచ్చిన గ్రాంట్‌ను కూడా గత ప్రభుత్వం వాడేసింది. జల్‌జీవన్ కోసం రూ.80వేల కోట్లు కావాల్సి ఉంటే.. గత ప్రభుత్వం కేవలం రూ.20వేల కోట్లు అడిగింది. అందరూ గర్వపడేలా రాజధాని నిర్మిస్తాం గత ప్రభుత్వంలో రంగుల పిచ్చి ఎక్కువయ్యింది.. సర్వే రాళ్లపైనా బొమ్మలు వేసుకున్నారు. పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే మా లక్ష్యం. ఇళ్లు లేని పేదలకు ఐదేళ్లలో ఇళ్లు నిర్మిస్తాం. గ్రామీణ పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం ఇస్తాం. ఉగాది రోజున పీ-4 విధానాన్ని ఆవిష్కరిస్తాం. 20లక్షల ఉద్యోగాల కల్పన మా ప్రభుత్వ బాధ్యత. రూ.6.50లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ పూర్తి చేశాం.

# మండలిలో వైసిపి ,టిడిపిల మధ్య మాటల యుద్ధం

**గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంలో వైకాపా విమర్శలు**
**తిప్పికొట్టిన మంత్రి లోకేశ్**



అమరావతిఫిబ్రవరి25((శ్రీచక్ర) ఏపీ శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చర్చలో భాగంగా కూటమి, వైసీపీ ఎమ్మెల్సీల మధ్య రగడ చోటు చేసుకుంది. వాడీ వేడీ చర్చ జరగింది. అధికార పార్టీ తీరును ఎమ్మెల్సీ వదురు కళ్యాణి ఎండగట్టారు. హామీలు ఇచ్చి అమలు చేయలేదని, వలంటీర్లను తొలగించారని, ఇష్టం వచ్చినట్లుగా విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అలాగే ఉద్యోగాల కల్పన అంశంపై మండలిలో వైసీపీ.. టీడీపీ మధ్య మాటల యుద్ధం నడిచింది. గవర్నర్ ప్రసంగం అంశంలో తెలుగు.. ఇంగ్లీష్‌లో ప్రచురణల మధ్య తేడా ఉంది అంటూ గందరగోళం నెలకొంది. ప్రజలను ఇబ్బంది పెడుతూ సుపరిపాలన అని చెప్పడం కూటమి ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమని వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ కల్యాణి ప్రశ్నించారు. గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని మండిపడ్డారు. నాలుగు లక్షల మంది ఉద్యోగాలు కల్పించామని స్పష్టంగా గవర్నర్ ప్రసంగంలో ఉందని వైసీపీ ఎమ్మెల్సీ అన్నారు.దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. 'మేము ఉద్యోగాలు ఇచ్చామని ఎక్కడా చెప్పలేదు.. ఉద్యోగ అవకాశాలు కల్పించామనే చెప్పాం.. నియమించామని చెప్పలేదు' అని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు వాస్తవాలు మాట్లాడాలన్నారు. వాకౌట్ చేయొద్దని.. అన్నింటిపైనా చర్చిద్దామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం కావాలని అంటారు... మళ్ళీ ఇంగ్లీష్‌లో చెప్తే ఇబ్బంది అంటారని మంత్రి అన్నారు. గవర్నర్ ప్రసంగం తెలుగు అనువాదంలో తేడా ఉందని.. తప్పుంటే మార్చుకుంటామని చెప్పండి అని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ ఎంపీలపై ఆధారపడి ఉందంటూ వైసీపీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను మంత్రి లోకేష్ తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రానికి మద్దతు తెలిపామని స్పష్టం చేశారు. కేంద్రం మెడలు వంచి నిధులు తీసుకొస్తామని ఆనాడు పులివెందుల ఎమ్మెల్యే అన్నారని.. ఏమైందని అని ప్రశ్నించారు. ఐదేళ్లలో రాష్ట్రానికి చేసిందేంటి అని వైసీపీని నిలదీశారు. ఆనాడు రాష్ట్రాన్ని కాపాడాలని ప్రధాని మోదీని చంద్రబాబు, పవన్ కోరారని.. దానిలో భాగంగా ఇప్పుడు రైల్వేజోన్‌ను తీసుకొచ్చామని.. పోలవరం నిధులు, అమరావతికి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీఏ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం ఏపీకి చాలా చాలా అవసరమన్నారు. ఎలాంటి కండిషన్లు పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు కోసం టీడీపీ, జనసేన చేరామని.. అన్‌కండిషనల్‌గా మద్దతు తెలుపుతామన్నారు. ఐదేళ్లలో వైసీపీ తీసుకురాని నిధులను.. తొమ్మిది నెలలో రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. అలాగే వైసీపీ నేతలకు కూడా మంత్రి స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడి చేశారో వారిని వదిలే ప్రసక్తే లేదని.. మార్క్ మై వర్డ్స్ అంటూ హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో ఇంగ్లీష్ మీడియంపై రగడ చోటు చేసుకుంది. ఇంగ్లీష్ మీడియం లేకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎలా వస్తాయని వైసీపీ ఎమ్మెల్సీ మాధవ్ ప్రశ్నించగా.. హోంమంత్రి అనిత ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.

# గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైకాపా తీరు గర్హనీయం

**సభ్యత మరచి ప్రవర్తించిన మాజీ సిఎం**
**స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం**



అమరావతి,ఫిబ్రవరి25((శ్రీచక్ర) : అసెంబ్లీలో వైకాపా సభ్యుల ప్రవర్తనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల రెండోరోజు సభ ప్రారంభం కాగానే ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైకాపా సభ్యులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. సీఎంగా పనిచేసిన వ్యక్తి సభ్యత మరిచి ప్రవర్తించారని జగన్‌ను ఉద్దేశించి అయ్యన్న వ్యాఖ్యానించారు. తన పార్టీ సభ్యుల తీరును నియంత్రించాల్సింది పోయి కూర్చుని నవ్వుకుంటారా? అని నిలదీశారు. బొత్స వంటి సీనియర్ నేత పక్కనే ఉండి కూడా జగన్ చేసేది తప్పని చెప్పలేదని ఆక్షేపించారు. రానున్న రోజుల్లో ఇలాంటివి జరగడానికి వీల్లేదని.. ఇకనైనా జగన్ విజ్ఞతతో వ్యవహరి ంచాలన్నారు. ఇదిలావుంటే 'సాక్షి' మీడియాకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. సభా హక్కుల కమిటీకి ఆ పత్రిక కథనాలను రిఫర్ చేశారు. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు జరగకుండా రూ.కోట్లు వెచ్చించారంటూ తప్పుడు కథనం రాశారని నందికొట్కూర్ ఎమ్మెల్యే జయసూర్య సభ దృష్టికి తీసుకొచ్చారు. సాక్షి మీడియాపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో స్పీకర్ స్పందిస్తూ సభా హక్కుల కమిటీకి రిఫర్ చేశారు.

# వైసిపి పాలనలో సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్

**గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైసిపి రచ్చ**
**ఐదేళ్లు ఎలాంటి ఇబ్బందులు పడ్డామో చూశాం**
**అన్నివర్గాలను వేధించిన తీరు ప్రజలంతా చూశారు**
**అసెంబ్లీలో అల్లరి చేస్తే కేసులుండవనే ధీమాతో ఇలా చేస్తారా**
**కూటమి ప్రజల కోసం ఏర్పడింది...ప్రజల కోసమే పనిచేస్తుంది**
**గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు**



అమరావతి,ఫిబ్రవరి25(శ్రీచక్ర) :వైసీపీ పాలనలో ఏపీ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీ అసెంబ్లీలో వైసీపీ సభ్యుల తీరు చూస్తే పాలసీ టెర్రరిజం గుర్తుకు వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం జరిగేటప్పుడు డిగ్నిటీని మెయింటెయిన్ చేయాలని రూల్ బుక్‌లో కూడా రాసి ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు.అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరపున, వ్యక్తిగతంగా తన తరపున ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఇలాంటి సెషన్‌లు ఎప్పుడూ చూడలేదు... గొడవ ఎలా ఉంటుందో ఇప్పుడు చూడటమేనని పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్ ఉన్నప్పుడు తెలంగాణ అంశంలో ఇలాంటి గొడవ చూశానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అసలు అసెంబ్లీలో ఇలా ప్రవర్తించవచ్చా అని తనకు అనిపిస్తోందని అన్నారు. వైసిపి సభ్యులే ఈ రూల్‌ను బ్రేక్ చేస్తే ప్రజలకు ఏం చెబుతామని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. అసెంబ్లీలో గొడవలు జరిగితే కేసులు ఎందుకు పెట్టరని మంత్రి మనోహర్‌ను అడిగానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇక్కడ సభ్యులపై కేసులు పెట్టడం లేదంటే అన్ని విషయాలు మాట్లాడే స్వేచ్ఛ ఇచ్చారనే కదా అని పవన్ కల్యాణ్ చెప్పారు. నిన్న వైసీపీ సభ్యులు గవర్నర్‌పై చేసిన గొడవ మంచిది కాదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్‌గా ఆయన ఉన్నప్పుడు ధైర్యం చేయగలరా, కళ్లల్లో చూడగలరా అని పవన్ కల్యాణ్ నిలదీశారు. నిన్న మీడియా ప్రతినిధులు తనను అడిగారు... వైసీపీ అనేది గొడవలకు పర్యాయపదమని విమర్శించారు. నిన్న అసెంబ్లీలో గొడవ జరిగిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇన్నేళ్లు వైసీపీ నేతలను తట్టుకొని నిలబడటం చూస్తే ఆయనకు హ్యాట్సాఫ్ చెప్పాలని పవన్ కల్యాణ్ అన్నారు. నిన్న వారి గొడవ చూస్తే ఎప్పుడైతే పేపర్లు విసిరేసి అక్కడికి వచ్చారో వివేకానంద రెడ్డి హత్య గుర్తుకువచ్చింది, ప్రజావేదిక, 200 ఆలయాల కూల్చివేతలు గుర్తుకువచ్చాయి, డాక్టర్ సుధాకర్ చనిపోవడం, జంగారెడ్డిగూడెం పవన్ కల్యాణ్ చెప్పారు. పత్రికాధిపతులపై దాడులు, టీడీపీ నేతలపై జరిగిన దాడులు, 53రోజులు చంద్రబాబును జైల్లో పెట్టిన విధానం పెట్టిన హింస గుర్తుకువచ్చిందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.గవర్నర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోయినా ఆయన ప్రసంగించ్చినందుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచి వైసీపీ సభ్యులను ఇబ్బంది పెట్టవద్దని సీఎం చంద్రబాబు చెప్పారని.. నుంచి వైసీపీ సభ్యులు బయటకు వెళ్లిపోవడంలో తమ తప్పులేకపోయినా గవర్నర్‌కు ప్రభుత్వం తరపున క్షమాపణలు చెప్పామని అన్నారు. గత జగన్ ప్రభుత్వం మూడు ముక్కలు ఆడటంతో పెట్టుబడులు రాక ఏపీ ఆర్థిక పరిస్థితి క్షీణించిందని వాపోయారు.

# కూటమి కరపత్రాన్ని గవర్నర్‌తో చదివించారు

**అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేశారు**
**కనీసం బడ్జెట్ అయినా ప్రజల ఆశలకు అనగుణంగా ఉండాలి**
**మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల**

విజయవాడ,ఫిబ్రవరి25(శ్రీచక్ర) ): శాసనసభ బ్జడెట్ సమావేశాల్లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం పూర్తిగా సత్యదూరమని ఆంధప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.. ప్రజల అంచనాలకు భిన్నంగా 30 మోసాలు, 60 అబద్దాలు అనే సామెతను తలపించిందని విమర్శించారు. మంగళవారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో షర్మిల మాట్లాడారు. గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని.. కూటమి కరపత్రాన్ని చదివించారని మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠం చూపించడం తప్ప.. మేనిఫెస్టో హామీల్లై స్పష్టమైన ప్రకటన ఎక్కడా లేదని అన్నారు. అందుకే ఈ నెల 28వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రజల ఆశయాలకు అద్దం పట్టేలా ఉండాలని,.. సూపర్ సిక్స్ హామీలను ఈ ఏడాది నుంచే అమలు చేసేలా నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. 8 నెలలు దాటినా ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇంకా ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలపై క్లారిటీ లేనే లేదని చెప్పారు.

# సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్‌కు జీవిత ఖైదు

**శిక్షను ఖరారు చేసిన ప్రత్యేక కోర్టు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి25((శ్రీచక్ర) 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్‌కుమార్‌కు ప్రత్యేక కోర్టు మంగళవారం జీవితఖైదు విధించింది. ఫిబ్రవరి 12న కోర్టు సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారించింది. అతని శారీరక, మానసిక ఆరోగ్యంపై నివేదిక సమర్పించాల్సిందిగా తీహార్‌జైలు అధికారులను ఆదేశించింది. జీవితఖైదు, ఉరిశిక్షలు విధించే కేసుల్లో ఇటువంటి నివేదికను కోరాల్సిందిగా సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 1984 సిక్కు మారణకాండలో తన భర్త, కుమారుడిని కోల్పోయిన బాధితురాలు తన పిటిషన్‌లో నిందితునికి గరిష్టంగా మరణశిక్ష విధించాలని అభ్యర్థించారు. 1984 అక్టోబర్ 31న ప్రధాని ఇందిరాగాంధీని సిక్కు బాడీగార్డ్స్ హత్య చేసిన మరుసటి రోజు సిక్కులపై ఊచకోత జరిగింది. ఈ మారణకాండలో వేల మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు నిరాశ్రయులయ్యారు.

# సంపాదకీయం

## మళ్లీ తెరపైకి త్రిభాషా సూత్రం.. ఉద్యమం

కేంద్ర ప్రభుత్వం బలవంతంగా త్రిభాషా సూత్రం కింద హిందీ భాషను అమలులోకి తీసుకురావాలన్న ప్రయత్నాలను దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడులో అమలు చేయడానికి ప్రయత్నించడాన్ని మొదటినుంచి ఆ రాష్ట్రం వ్యతిరేకిస్తున్న చరిత్ర ఉంది. హిందీ వ్యతిరేక ఉద్యమాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. కొన్ని వేలమంది అరెస్టు అయ్యారు. ఇప్పుడు మళ్లీ ఈ వివాదం తెరపైకి వచ్చింది. హిందీని అంగీకరించే రాష్ట్రాలు తమ మాతృభాషను కోల్పోతాయని, అవసరమైతే తమ రాష్ట్రం భాషా యుద్ధానికి సిద్ధంగా ఉందని తమిళనాడు డిఎంకె ప్రభుత్వం స్పష్టం చేయడం కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదం రాజుకుంటోంది. జాతీయ విద్యా విధానాన్ని పూర్తిగా స్వీకరించకపోతే, ప్రస్తుతం అమలవుతున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) కింద రాష్ట్రానికి దాదాపు రూ. 2400 కోట్ల నిధులు కేటాయించడం కుదరదని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెగేసి చెప్పడం మళ్లీ హిందీ వ్యతిరేక ఉద్యమానికి సన్నాహాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తీవ్రంగా స్పందించి కేంద్ర ప్రభుత్వానికి ఘాటుగా సమాధానం ఇచ్చారు.ఇది మీ సొంతడబ్బు కాదని, పన్నుల వికేంద్రీకరణనుండి తమ రాష్ట్రానికి రావలసిన డబ్బు వాటా మాత్రమే డిమాండ్ చేస్తున్నామని ఎత్తిచూపారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ మీరు (బిజెపి) మమ్మల్ని బెదిరించాలని అనుకుంటే అది తమిళనాడులో ఎప్పటికీ జరగదు" అని చెన్నైలో డిఎంకె సారథ్యంలో జరిగిన నిరసన ర్యాలీలో స్టాలిన్ హెచ్చరించారు. ఇది ద్రావిడ భూమి, పెరియార్ భూమి? అని బిజెపికి గుర్తు చేస్తూ.. గతసారి మీరు తమిళ ప్రజల హక్కులను హరించడానికి ప్రయత్నించినప్పుడు వారు 'గోబ్యాక్ మోడీ' అని ఉద్యమించారు. మీరు మళ్లీ ప్రయత్నిస్తే ఈసారి 'గో అవుట్ మోడీ' అన్న నిరసనలతో మిమ్మల్ని వెనక్కు పంపడానికి భారీ ఎత్తున ఆందోళన లేవడం తథ్యం' అని హెచ్చరించారు. ఉదయనిధి స్టాలిన్ హిందీని అంగీకరించడంపై ఎదురయ్యే అనర్థాలను తెలియజేస్తూ అనేక రాష్ట్రాలు తమ మాతృభాషలను కోల్పోతున్నాయని ఉదాహరణగా భోజ్‌పురి, బీహార్, హర్యానీ భాషలు హిందీ చొరబాటుతో దాదాపు అంతరించాయని వివరించారు.త్రిభాషా సూత్రంపై దక్షిణాది రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య చాలా కాలంగా వివాదం ఉంటోంది. ఐదేళ్ల క్రితం కేంద్రం కొత్త విద్యావిధానాన్ని ప్రకటించింది. అప్పటినుంచి ఈ వివాదం మరింత వైరుధ్యంగా పెరిగింది. ఈ కొత్త విద్యావిధానం కింద విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలను నేర్చుకోవలసి వస్తుంది. వీటిలో హిందీ ఒకటి. గత వారం వారణాసిలో కేంద్ర విద్యామంత్రి ప్రధాన్ తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రత్యేకించి రాజకీయ ప్రయోజనాల కారణంగా ఈ విధానాన్ని అంగీకరించడం లేదని ఆరోపించారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని హిందీభాష చిచ్చును రగిలించి తమిళనాడును రాజకీయంగా చీలికలు తెచ్చి తమ పబ్బం గడుపుకోవాలన్నది బిజెపి ఎత్తుగడ. చారిత్రకంగా చూస్తే తమిళ ఓటర్లు బిజెపికి దూరంగానే ఉంటున్నారు. 2016లో మొత్తం 234 సీట్లలో బిజెపి పోటీచేసినా ఒక్కస్థానం కూడా దక్కలేదు. 2021లో కేవలం 20 స్థానాల్లో మాత్రమే పోటీ చేసినా, నాలుగు మాత్రమే గెల్చుకుంది. లోక్‌సభ ఎన్నికల రికార్డు చూసినా అధ్వానమే. 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా సున్నాయే వచ్చింది.తమిళనాడు చారిత్రాత్మకంగా 'ద్విభాషా' విధానాన్ని కలిగి ఉంది. అంటే తమిళం, ఆంగ్ల భాషలను బోధిస్తుంది. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి దక్షిణ భారత రాష్ట్రం తమిళనాడులో (గతంలో మద్రాస్ రాష్ట్రం, మద్రాస్ ప్రెసెడెన్సీలో భాగం) హిందీ వ్యతిరేక ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. 1937లో సి. రాజగోపాలాచారి నేతృత్వంలోని మొదటి భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి) ప్రభుత్వం మద్రాస్ ప్రెసిడెన్సీ పాఠశాలల్లో హిందీబోధన తప్పనిసరి చేయాలని ప్రయత్నించింది. దీనికి పెరియార్ ఇవి రామస్వామి, సోమసుందర భారతీయార్, ప్రతిపక్ష జస్టిస్ పార్టీనుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మూడేళ్ల పాటు సాగిన ఉద్యమాలలో 1198 మంది అరెస్టు కాగా, ఇద్దరు మరణించారు. 1940లో తప్పనిసరి హిందీ విద్యాబోధనను ఉపసంహరించుకున్నారు. దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, 1950 జనవరి 25న కొత్త రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత అనేక హిందీయేతర రాష్ట్రాలు హిందీని ఏకైక అధికార భాష గా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాయి.అప్పటి మద్రాస్ రాష్ట్రంలో డిఎంకె (ద్రవిడ మున్నేట్ర కజగం) నేతృత్వంలో హిందీ వ్యతిరేక ఉద్యమం సాగింది. 1965 జనవరిలో విద్యార్థుల మద్దతుతో హిందీ వ్యతిరేక ఉద్యమం హింసాత్మక సంఘటనలతో రెండు నెలల పాటు సాగింది. పారా మిలిటరీ ప్రమేయంతో ఇద్దరు పోలీసులతో సహా 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి హిందీయేతర రాష్ట్రాలు కోరుకున్నంత కాలం ఇంగ్లీష్ అధికారిక భాషగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. దీంతో అల్లర్లు, విద్యార్థుల ఆందోళనలు సద్దుమణిగాయి. 1967లో ఇందిరా గాంధీ ప్రభుత్వం అధికారిక భాషల చట్టాన్ని సవరించింది. ద్విభాషా విధానాన్ని నిర్ధారించింది. 1968, 1986లో కూడా హిందీ వ్యతిరేక ఉద్యమాలు జరిగాయి. హిందీ భాష తప్పనిసరి అని కేంద్ర ప్రకటిస్తున్నప్పుడెల్లా దాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడులో ఉద్యమాలు సాగుతుండడం పరిపాటి అవుతోంది. దీనిపై లేనిపోని రాద్ధాంతాలకు పోకుండా దక్షిణాది రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం ఫెడరల్ స్ఫూర్తిని గౌరవించినట్టు అవుతుంది.

## వెల్ల రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించిన కౌన్సిల్ సభ్యులు






రామచంద్రాపురం, ఫిబ్రవరి 25( శ్రీచక్ర) రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సిల్ సభ్యులందరూ వెల్ల గ్రామంలో వున్న రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. పట్టణ పరిధిలో కలుషిత నీరు వస్తోందని ప్రజలనుంచి వస్తున్న పిర్యాదుల మేరకు కౌన్సిల్ సభ్యులు అందరూ వెళ్ళి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను, ప్లాంట్ లో శాన్డ్ బెడ్లు, క్లారిఫైలను, లో లిఫ్ట్ పెంపు, క్లీర్ వాటర్ పెంపు హౌస్, రోడ్డు, కొబ్బరి మొక్కలు, వివిధ రకాల ఫలాలకు చెందిన మొక్కలను పరిశీలించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన రక్షిత మంచినీటిని అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని చైర్ పర్సన్ ఆదేశించారు. రంగు మారిన నీళ్ళు రావడం గమనించి, వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా ఆదేశించారు. రక్షిత మంచినీటి సరఫరా లో తలెత్తుతున్న సమస్యలు వాటి పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇంజనీర్లను రప్పించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అయ్యప్పనాయుడు, డి ఈ శ్రీకాంత్, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, చీఫ్ విప్ సాయి ప్రసాద్ వాడ్రేవు, కౌన్సిలర్ లు అంకం శ్రీనివాస్, కేతా శ్రీను,నల్లా అంజమ్మ, తోట అమ్మాజీ, పెంటపాటి దేవి, పోతంశెట్టి శ్యామలత , బాసిన నాగమణి, కోటిపల్లి లక్ష్మీ శివాజీ, బావాలు మంగామణి, గాదె సీతామహాలక్ష్మి, షేక్ మస్తాన్, తదితరులు ఉన్నారు.

## జనసేన గూటికి దువ్వాడ వాణి



విజయనగరం, ఫిబ్రవరి 25,దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి జనసేనలో చేరతారా? ఆ ప్రయత్నాల్లో ఉన్నారా? జనసేన అగ్ర నేతలతో టచ్ లోకి వెళ్లారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. దీనిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. దువ్వాడ వాణి ప్రస్తుతం టెక్కలి జడ్పీటీసిగా ఉన్నారు. ఆ పార్టీ మహిళా నేతగా కొనసాగుతున్నారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆమె జనసేనలోకి వెళ్తారని పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్ వ్యవహార శైలి హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. గత కొద్ది నెలల కిందట దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వ్యవహారం రచ్చకు దారితీసింది. భార్య వాణి తో పాటు పిల్లలు దువ్వాడ ఇంటివద్ద ఆందోళనకు దిగారు. కొత్త ఇంటిని తమ పేరున రాయాలని డిమాండ్ చేశారు. అదో సీరియల్ ఎపిసోడ్ లా నడిచింది. అయితే చివరకు దువ్వాడ శ్రీనివాస్ తన సన్నిహితురాలు మాధురికి ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఈ ఎపిసోడ్ ముగిసింది.ప్రస్తుతం దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి వ్యాపార రంగంలో అడుగు పెట్టాలని భావిస్తున్నారు. మరోవైపు రాజకీయ రంగంలో కూడా కొనసాగుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ బలమైన వాయిస్ వినిపిస్తున్నారు. అయితే దువ్వాడ శ్రీనివాసులు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దువ్వాడ వాణి కోరుతూ వచ్చారు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం వినలేదు. దానికి సమ్మతించలేదు. అందుకే దువ్వాడ వాణి జనసేనలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఆమెకు బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. ఆమె తండ్రి సంపతి రావు రాఘవరావు ఎంపీపీగా వ్యవహరించారు. ఆయన అల్లుడిగా రాజకీయాల్లోకి వచ్చారు దువ్వాడ శ్రీనివాస్. గతంలో దువ్వాడ వాణి టెక్కలి ఎంపీపీగా, జడ్పీటిసి గా కూడా వ్యవహరించారు. సమకాలిన రాజకీయ అంశాలపై మంచి అవగాహన ఉంది. అందుకే ఆమె జనసేన లో చేరతారని తెలుస్తోంది.2024 ఎన్నికలకు ముందు దువ్వాడ వాణిని)టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించారు జగన్మోహన్ రెడ్డి. కుటుంబంలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాస్ అప్పట్లో తప్పుకున్నారు. అతని బదులు భార్య వాణికి ఇన్చార్జ్ పోస్ట్ ఇచ్చారు. కానీ సరిగ్గా ఎన్నికలకు ముందు టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ పేరును ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు దువ్వాడ వాణి. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు కలుగజేసుకోవడంతో శాంతించారు. అయితే మొన్న భర్తతో జరిగిన వివాదం నేపథ్యంలో దువ్వాడ వాణి ఎన్నికల్లో టిడిపికి మద్దతు తెలిపారని శ్రీనివాస్ ఆరోపించారు. ఇప్పటికీ దువ్వెల మాధురి అదే మాట చెబుతున్నారు. టెక్కలిలో దువ్వాడ వాణి తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపారని ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో దువ్వాడ శ్రీనివాస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే దువ్వాడ వాణికి అవకాశం లేకుండా పోతుంది. దువ్వాడ శ్రీనివాస్ తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలంటే దువ్వాడ వాణి జనసేన లో చేరాలని డిసైడ్ అయ్యారని తెలుస్తోంది. అటు బలమైన సామాజిక వర్గం, ఆపై రాజకీయ అనుభవం ఉండడంతో వాణిని జనసేనలోకి తీసుకునేందుకు నాయకత్వం సైతం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే త్వరలో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పట్లో దువ్వాడ శ్రీనివాస్ ప్రజారాజ్యం పార్టీలో పనిచేశారు. అప్పట్లో భర్త వెంట దువ్వాడ వాణి కూడా పిఆర్పి లో చేరారు. మెగా కుటుంబంతో ఉన్న సంబంధాల దృష్ట్యా జనసేనలో చేరడమే మేలని వాణి సైతం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న వైయస్ జగన్ పై అనర్హత వేటు వేయాలి

**వైయస్ జగన్మోహన్ రెడ్డి పులి కాదు.. పిల్లి అని నిరూపణ అయింది**
**ముఖ్యమంత్రి చంద్రబాబుకు కక్ష సాధింపు ఉద్దేశం లేదు**
**నిజంగా అతనికి ఆ ఉద్దేశం ఉంటే వైసీపీ నేతలు అందరూ జైలులో ఉండేవారు**
**తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**

విశాఖపట్నం: కేవలం అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరయ్యారని .. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. మంగళవారం హోటల్ దసపల్లా లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గవర్నర్ అబ్దుల్ నజీర్ శాసనసభలోప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు నినాదాలుచేయడాన్నిరామ్‌తప్పు పట్టారు.' అప్రజాస్వామ్య చర్యకు మూల కారకుడైన వైయస్ జగన్మోహన్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని స్పీకర్ సి.హెచ్ అయ్యన్నపాత్రుడు ను బి.వి.రామ్ కోరారు. స్వయంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సోదరి.. వైయస్ షర్మిల కూడా అతని వైఖరిని తప్పుపట్టారన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు పట్టుమని పదకొండు నిమిషాలు కూడా శాసనసభలో లేకపోవడం ఏమిటని అభ్యంతరం వ్యక్తం చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కొనసాగించిన ప్రజా వ్యతిరేక పాలన పై తాను ప్రజాస్వామ్యబద్ధంగా యుద్ధం చేశానన్నారు. ఈ క్రమంలోనే తొమ్మిది పాటలను విడుదల చేసి వైసిపి దుర్మార్గాలను ప్రజలలోకి తీసుకెళ్లానని తెలిపారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా జగన్ కు వ్యతిరేకంగా సమావేశాలు ఏర్పాటు చేశానని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పులి కాదని.. పిల్లి అని అసెంబ్లీలో వ్యవహరించిన తీరును బట్టి స్పష్టం అవుతుందన్నారు. ఏది ఏమైనా నైతిక విలువలు లేని వైయస్ జగన్ పై అనర్హత వేటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు సమయంలో ఏ తప్పు చేయకుండానే అన్యాయంగా 53 రోజులపాటు జైలులో నిర్బంధించారన్నారు. ఒకవేళ చంద్రబాబు నాయుడుకి నిజంగా కక్ష సాధింపు ఉంటే వైసిపి నేతలు అందరూ జైలుకు వెళ్లేవారు అన్నారు.

## డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ తదితర కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు.రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు కూడా ఫీజును చెల్లించవచ్చని ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

## క్యూ ఆర్ కోడ్ తో రేషన్

కాకినాడ, ఫిబ్రవరి 25,కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. వచ్చే నెల నుంచి కొత్త కార్డుల జారీకి రంగం సిద్ధమవుతోంది. వీటిని క్యూ. వాస్తవానికి ఏపీలో కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతూ వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ఈ కొత్త రేషన్ కార్డుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత తొమ్మిది నెలలుగా అదిగో ఇదిగో అంటూ ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మార్చి నుంచి కొత్త కార్డుల జారీకి రంగం సిద్ధమవుతోంది.అధికారంలోకి వస్తే కొత్త రేషన్ కార్డులుజారీ చేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏటా రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టారు. అయితే అది తొలి నాలుగేళ్లకు మాత్రమే పరిమితం అయింది. గత ఏడాదిన్నరగా కొత్త కార్డుల జారీ అనేది లేకుండా పోయింది. వాస్తవానికి సంక్రాంతి నాటికి కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నాహాలు చేసింది. కార్డులను క్యూఆర్ కోడ్ తో ఉండేలా.. ప్రత్యేక రంగుతో రూపొందించింది. కానీ అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప జారీ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. దీనిపై విమర్శలు వస్తున్న క్రమంలో ప్రభుత్వం మార్చి నుంచి ఎట్టి పరిస్థితుల్లో రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తాజాగా రేషన్ కార్డుల జారీ పై మాట్లాడారు మంత్రి నాదెండ్ల మనోహర్. మార్చి నుంచి క్యూఆర్ కోడ్ తో కూడిన కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని చెప్పారు. మార్పులకు, చేర్పులకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఈ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటన నేపథ్యంలో వచ్చేనెల నుంచి ఏపీలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పట్టాలెక్కే అవకాశం ఉంది. అయితే ఇది వరకే మంత్రి నారా లోకేష్ స్పందించారు. క్యూఆర్ కోడ్ తోనే రేషన్ పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన ప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా కోటి 48 లక్షల తెల్ల రేషన్ కార్డులుఉన్నాయి. వీటిలో 90 లక్షల కార్డులు కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆహార భద్రత చట్టం కింద జారీ చేసినవి. ఈ కార్డులకు మాత్రమే కేంద్రం ఉచితంగా బియ్యం, తక్కువ ధరకు కందిపప్పు, పంచదారతో పాటు ఇతర సరుకులు అందిస్తోంది. మిగిలిన కార్డులను రాష్ట్ర ప్రభుత్వం రాసన్ సరుకులు అందిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కోడ్ ముగిసిన వెంటనే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది.

## విద్యుత్ షాక్ తో నలుగురు మృతి

గుంటూరు,పెదకాకాని కాళీ గార్డెన్స్ లోని గోశాల సంపులో ప్రమాదం జరిగింది.పూడికతీత పనుల్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి నలుగురు మృతి చెందారు.పెదకాకాని లోని శ్రీ కాళీ వనాశ్రమ గోశాల వద్ద దారుణం జరిగింది.గోశాల సంపులో పూడికతీత పనుల్లో పాల్గొన్న ముగ్గురు కూలీలు,ఒక రైతు విద్యుత్ షాక్ తో మృతి చెందారు.ఈ సంఘటనతో మృతుల కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించటం స్తానికులను కదిలించింది.ఘటనాస్తలానికి చేరుకుని ఎస్పీ సతీష్ కుమార్ విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గోశాలలోని సంపును క్లీన్ చేయటం అనేది రెగ్యులర్గా జరుగుతుందని తెలిపారు.కానీ మోటారు రిపేరు రావటంతో సంపులోకి దిగిన యువకుడికి షాక్ తగలటంతో ఒకరిని కాపాడేందుకు ఒక్కొక్కరుగా షాక్ తగిలి చనిపోయారని వివరించారు.ఈ మృతుల్లో ముగ్గురు తెనాలికి చెందిన వారని,ఒకరు సత్తెనపల్లి కి చెందిన వ్యక్తని తెలిపారు.

## ఏనుగుల దాడిలో ఐదుగురు మృతి

**మరో ఇద్దరి పరిస్థితి విషమం**
**గుండాల కోనలో ఏనుగుల బీభత్సం**

అన్నమయ్య,అన్నమయ్య జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఓబులవారిపల్లె మండలం గుండాలకోన అటవీ ప్రాంతంలో భక్తులపై ఏడుగులు దాడి చేశాయి. ఈ దాడిలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పలువురు భక్తులు శేషాచలం అడవుల గుండా తలకోనకు నడిచివెళ్తున్నారు. అయితే అటుగా వచ్చిన ఏనుగుల గుంపు భక్తుల చూసి రెచ్చిపోయింది. భక్తులపైకి దూసుకెళ్లేందుకు ఏనుగులు ప్రయత్నించగా వారంతా వాటిని భయపెట్టేందుకు గట్టిగట్టిగా కేకలు వేశారు. అయినప్పటికీ వారందరినీ చుట్టుముట్టేందుకు యత్నించాయి. దీంతో భక్తులంతా పరుగులు పెట్టారు. అయినా వదిలిపెట్టకుండా వెంటపడి మరీ దాడి చేసి నలుగురిని చంపేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను రైల్వేకోడూడు ఆస్పత్రికి తరలించగా.. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అందులో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. మృతుల్లో ఇద్దరిని కన్నెగుంట ఎస్టీ కాలనీకి చెందిన మణెమ్మ, చెంగల్ రాయుడుగా పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాలి

## ఆలపాటి కి బిజెపి మద్దతు

విజయవాడ,కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రులు నియోజకవర్గం నుంచి కూటమి పార్టీ లు బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. పట్టభద్రులు, ఉద్యోగులు సమస్యలు పరిష్కారం కోసం మండలిలో గళం విప్పగల అనుభవజ్ఞులైన నాయకులు రాజేంద్ర ప్రసాద్..గత ప్రభుత్వం నిరిద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి నెరవేర్చని పరిస్థితి చూసాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కల్పన కు ప్రాధాన్యత ఇస్తోంది.

## గెలుపు ఓటములను, సమానంగా స్వీకరించాలి



కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 (శ్రీ చక్ర ) : గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగినప్పుడే జీవితంలో ఎదిగే అవకాశం ఉంటుందని ఈ అవకాశాలు క్రీడల్లో లభిస్తాయని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలంపిక్ ఫెన్సింగ్ క్రీడను కర్నూలు నగరంలో క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఫెన్సింగ్ క్రీడలో డిజిటల్ టెక్నాలజీ మిళితమై ఉందన్నారు. ఈ క్రీడలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా లభించి ఉండటం అభినందనీయమని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఏకాగ్రత, ధ్యానం వంటి ఆరోగ్యానికి ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని వివరించారు. కర్నూలులో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి , ఫెన్సింగ్ క్రీడా శిక్షకుడు మహేశ్వరరావు ,మహేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు

### Xవిశ్రాంత పోలీసు అధికారుల ఆత్మీయ సమ్మేళనం



కర్నూలు , ఫిబ్రవరి 25 (శ్రీచక్ర): బ్యాచ్ కు చెందిన 92 మంది కర్నూల్ పోలీస్ కానిస్టేబుల్స్ అందరూ కలిసి సోమవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. అప్పట్లో హైదరాబాద్ అంబర్ పేట ట్రైనింగ్ సెంటర్ కు వెళ్ళి శిక్షణ పొందారు. సిఐలుగా, ఎస్సైలుగా, ఏఎస్సైలుగా, హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొంది పదవీ విరమణ పొందారు. పదవి విరమణ పొందిన వీరందరూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూల్ కొత్తపేటలోని, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ దగ్గర ఉన్న విశ్రాంత పోలీసు అధికారుల భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

### శివరాత్రి బ్రహ్మోత్సవాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు రేంజ్ డీఐజీ,నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ..



శ్రీశైలం-నంద్యాలజిల్లా- 25-02-2025పాగాలంకరణ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి పలు సూచనలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు, నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ గారు. నంద్యాల జిల్లా శ్రీశైలం నందు జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రేపు జరగనున్న ముఖ్యమైన పాగాలంకరణ కార్యక్రమానికి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు.పాగాలంకరణలో రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, భక్తులు, ప్రజలు రానున్న సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రేక్షకులు కూర్చునే ప్రదేశాలను మరియు ప్రేక్షకులు వచ్చు ప్రదేశాలలో వెళ్ళు ప్రదేశాలలో ఎలాంటి తొక్కిసలాటకు, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారుభక్తులు కూర్చునేందుకుకు అన్ని సదుపాయాలు కల్పించాలి. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించిన నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ గారుఅనంతరం స్వామి అమ్మవార్ల గజవాహన సేవలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

## ఆగము..... ఇక ఆపము-రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా జోరు...-పట్టించుకోని రెవెన్యూ అధికారులు పోలీస్ యంత్రాంగం







పెద్దకడబూరు ఫిబ్రవరి 20(శ్రీ చక్ర) పెద్ద కడుబూరు మండలం చిన్నకడబూరు గ్రామంలో అక్రమ ఇసుక రవాణాకు హద్దు అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వానికి కావాల్సిన ఆదాయానికి గండి కొడుతూ, కొంతమంది ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతుంది మంత్రాలయం నియోజకవర్గం పెద్ద కడుబూరు మండలం వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా జోరుగానే కొనసాగుతుంది. చిన్న కడుబూర్ కమ్మలదీన్నె జాలవాడి వివిధ పరిసర ప్రాంతాల నుండి పగలు, రాత్రులు తేడా లేకుండా నిత్యం ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక రవాణా జోరుగానే జరుగుతుంది. అక్రమ ఇసుక రవాణాను అరికట్టే క్రమంలో, పెద్ద కడబూరు తాసిల్దారి. ఆదేశాల మేరకు గత కొద్ది రోజుల క్రితం మండలం లో పదికి పైగా రెవిన్యూ వారు బైండ్ ఆవర్ కేసులు నమోదు చేయడం జరిగింది.. అయినప్పటికీ, ఇక్రమ ఇసుక రవాణాకు అలవాటు పడిన కొందరు యధావిధిగా ఇసుక రవాణా చేసినప్పటికీ రెవిన్యూ అధికారాలు మాత్రం వారికేమి పట్టనట్టుగా వ్యవహరించడం పట్ల మండల వ్యాప్తంగా సర్వత విమర్శలు వెలివెత్తుతున్నాయి. ఇసుక రవాణాపై పత్రికలతో పాటు సోషల్ మీడియా వేదికగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందని రాసినప్పటికీ రెవిన్యూ అధికారులు తమకేమీ పట్టినట్లు వ్యవహరి స్తున్నారు మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రవాణాకు అలవాటు పడిన కొందరు వ్యక్తులు ఎటువంటి భయాలు లేకుండా, అధికారులు మమ్మల్ని ఏమి చేయలేరు అనే ధీమాతో యదేచ్ఛగా పట్టపగలు, అర్ధరాత్రీలు ట్రాక్టర్లలో యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ 3000 నుండి 4000 వరకు వసూలు చేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా చేసే వారిలో ప్రముఖంగా, చిన్న కడుబూర్ గ్రామానికి చెందినవారు కూడా ఈ అక్రమ ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇంత తథాంగం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఉన్నతాధికారులు కట్టడి చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు...

## ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలి

**Xప్రతి పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక?షన్ అమలు చేయాలి**
**Xకాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ లాంటివి జరగకూడదు**
**Xజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**





కర్నూలు, ఫిబ్రవరి 25 (శ్రీచక్ర): ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా, ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్ లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పకడ్బందీ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి నెల 17 నుండి 31 వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు, మార్చి 17 నుండి 28 వరకు జరిగే పదవ తరగతి ఓపెన్ పరీక్షలకు, మార్చి 3 నుండి మార్చి 15 వ తేది వరకు జరిగే ఇంటర్మీడియేట్ ఓపెన్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని పరీక్షల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.. కర్నూలు జిల్లాకు సంబంధించి అన్నిటికీ కలిపి 172 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 40,776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. గత రెండు మూడు సంవత్సరాలలో జరిగిన ఇన్సిడెంట్లను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మకంగా గుర్తించిన సెంటర్ల వివరాల లిస్టును పోలీసు అధికారులకు, తహసిల్దార్లకు ఇవ్వాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటుకు సంబంధించిన ప్రొసీడింగ్ లు ఇచ్చేందుకు డిఆర్ఓ తో కో ఆర్డినేట్ చేసుకోవాలని కలెక్టర్ డిఈఓ ను ఆదేశించారు.. ప్రతి పరీక్ష కేంద్రం దగ్గర 144 సెక?షన్ అమలు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్స్ దగర ఆర్మ్డ్ గార్డ్స్ ని ఏర్పాటు చేయాలని, పేపర్ డిస్ట్రిబ్యూషన్ కి ఎస్కార్ట్ తో వెళ్లాలని, పరీక్ష కేంద్రాల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సౌకర్యం ఉండాలని, పరీక్షా కేంద్రంలో త్రాగు నీటి వసతి కల్పించాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సరైన సమయానికి చేరుకునేందుకు అవసరమైన బస్సు సదుపాయాలు కల్పించాలని, రవాణా విషయంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల దగ్గర మెడికల్ స్టాఫ్ తో పాటు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ప్రశ్నపత్రం లీక్‌లు కి సంబంధించి ఎలాంటి వదంతులు వచ్చినా వెంటనే కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారికి తెలియజేయాలని కలెక్టర్ సమాచార శాఖ అధికారులను ఆదేశించారు.. 10వ తరగతి పరీక్షలలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు సంబంధించి పరీక్షల నిర్వహణకు 172 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 40,776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వారు సీసీ కెమెరాలు ఇవ్వడం జరిగిందని వాటిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వీఆర్ఏ కుటుంబానికి న్యాయం చేయాలి....



డోన్ -ఫిబ్రవరి 25 డోన్ డివిజన్,అవుకు మండలం,ఉప్పలపాడు గ్రామంలో భూ సర్వేలో భాగంగా విధులు నిర్వహిస్తూ విద్యుత్ ప్రమాదానకి గురై మృతి చెందిన ఉప్పలపాడు గ్రామ విఆర్ఎ తలారి రాముడు (56) కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,ఎపి.గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డోన్ డివిజన్ నాయకులు టి.రామచంద్రుడు,ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి బి.రామనాయుడు,డోన్ మండల ఉపాధ్యక్షులు శివశంకర వరప్రసాద్, సహాయ కార్యదర్శి రంగయ్య డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం డోన్ ఆర్డీవో కార్యాలయం నందు డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.అంజన్ బాబు కి వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ అవుకు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో భూ సమగ్ర సర్వేలో భాగంగా సోమవారం భూములను సర్వే చేసేందుకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళుతున్న సమయంలో తలారి రాముడు భుజంపై ఉన్న భూములను కొలతలు కొలిచే ఇనుప పరికరం రోవర్ పొలంలో క్రిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు.తలారి రాముడు ఉప్పలపాడు గ్రామంలో గత 30 సంవత్సరాలుగా గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తు_న్నాడన్నారు.అతనికి భార్య తలారి లక్ష్మీదేవి,ఒక కుమారుడు,ఇద్దరు కుమార్తెలు సంతానం ఉండగా వారిలో కుమారుడు రవి కుమార్, కుమార్తె రాజేశ్వరి పుట్టుకతోనే వికలాంగులని వారు జీవితాంతం మంచానికే పరిమితం అని ఆవేదన వ్యక్తం చేశారు.కావున తలారి రాముడు కుటుంబంలో ఒకరికి తక్షణమే ఉద్యోగం ఇవ్వాలని,50 లక్షల రూపాయలు నష్టపరిహారంగా చెల్లించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని,అదేవిధంగా విద్యుత్ తీగలు క్రిందకు వేలాడుతున్నా పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించి తలారి రాముడు మృతికి కారకులైన విద్యుత్ అధికారులపై సమగ్ర విచారణ జరిపించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డోన్,ప్యాపిలి విఆర్ఎలు రవికుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### మహాశివరాత్రి సందర్భంగా శ్రీ గౌరీ శంకర స్వామి వారికి ప్రత్యేక పూజలు..

ఫిబ్రవరి 25 కర్నూలు జిల్లా...శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో 26.02.2025 బుధవారం మహాశివరాత్రి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ గౌరీ శంకర స్వామి వారికి ఉదయం 6:00 గం"ల నుండి రుద్రాభిషేకములు జరుపబడును. ఉదయం 11.00 గం"లకు మృత్యుంజయ పాశుపత రుద్రహోమ సహిత కాలభైరవ, రాజ శ్యామల హోమం జరుగును. తిరిగి సాయంకాలం 6 గం"లకు నుండి నుండి రుద్రాభిషేకములు రాత్రి 11.00 గం లకు మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకములు లింగోద్భవ కాలంలో నిర్వహించబడును. 27-02-2025 గురువారం సాయంత్రం 06.30 గం"లకు శివపార్వతుల కళ్యాణం జరుపబడును. ఏక వార రుద్రాభిషేకములు:- 200 /- మహన్యాస పూర్వ ఏక దశవారం లింగోద్భవంలో:- 300 /- రుద్రహోమం,రాజ శ్యామల హోమం ప్రధానంగా:-4000/-రుద్రహోమసంకల్పం:-116/ శివపార్వ తులకల్యాణంప్రధానంగా:2500/శివపార్వతులకళ్యాణం సంకల్పం:-116/- సంప్రదించవల సిన నెంబరు. డి లక్ష్మీనరసింహాశర్మ. 8008774086దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబ రు. 8896123777ఆఫీస్ ల్యాండ్ లైన్ నెంబర్:08518-234388..

### చెంచుల అభివృద్ధే నా ధ్యేయం :ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల ఫిబ్రవరి 25-నల్లమల అరణ్యంలోని చెంచుల అభివృద్ధికి నిధుల కొరత లేదని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం చెంచుల సంక్షేమం కోసం ప్రత్యేక కొత్త పథకం ఏర్పాటు చేసి వారి అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.శ్రీశైలం పాదయాత్రగా వెళ్ళుతూ నల్లమల అరణ్యంలోని చెంచుల రాజధాని పెచ్చేరువు చెంచుగూడెంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెంచు మహిళలు, గూడెం పెద్దలతో వారి సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్రూర మృగాలు, విష సర్పాల మధ్య కనీస వసతులకు దూరంగా బ్రతుకుతున్నామని, అటవీ అధికారుల వేధింపులు తొలగించాలని, ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణం పనులు చేయకుండా అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని, తదితర సమస్యలను వినతి పత్రం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి చెంచు మహిళలు అందించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ 20 రోజుల క్రితమే నంద్యాల పార్లమెంట్ పరిధిలోని చెంచులకు 600 లకు పైగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందని, సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలచెంచు గూడెంలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 4.40 కోట్ల తో తారు రోడ్డు మంజూరు చేయడం జరిగిందని, రూ. 1.50 కోట్ల నిధులతో ఈ గూడెంలలో విద్యుత్ సరఫరాకు నిధులు మంజూరు చేయించి కరెంటు పనులు పూర్తి చేశామన్నారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ కేటాయింపులు:మేయర్ స్రవంతి



శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు ఫిబ్రవరి 25నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్నీ డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా నూతన బడ్జెట్ ను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి పేర్కొన్నారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో బడ్జెట్ రూపకల్పన సమావేశాన్ని మేయర్ చాంబర్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నగరపాలక సంస్థకు బడ్జెట్ కేటాయింపులో భాగంగా అన్ని విభాగాల అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని తుది మెరుగులు దిద్దుతున్నామని తెలిపారు. నగర వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు నూతన బడ్జెట్ లో ప్రాధాన్యత కల్పించనున్నామని పేర్కొన్నా?రు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నగర పాలక సంస్థ బడ్జెట్ కేటాయింపులు చేపట్టామని, సంక్షేమంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధిని చూపేందుకు ప్రణాళికాబద్ధంగా బడ్జెట్ ను రూపొందించనున్నామని మేయర్ ప్రకటించారు. విభాగాల వారీగా రూపొందించిన బడ్జెట్లో నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనులకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ కేటాయింపులు జరపనున్నామని, అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ ను ప్రతిష్టాత్మకంగా రూపొందించి, అమలు చేస్తామని మేయర్ వెల్లడించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓంకార నాదం ప్రతి ఇంట మారుమోగాలి

### తెలుగు ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు ఫిబ్రవరి 25ప్రతి ఇల్లు ఓంకార నాదంతో మారుమ్మ?గాలని, లయకారుని కరుణ కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. బోలా శంకరుడు, కాశీ విశ్వేశ్వరుడు, సర్వాంతర్యామి అయిన మహాదేవుడు ఎల్లవేళలా దివ్య ఆశీస్సులు ప్రజలందరికీ ప్రసాదించాలని రాష్ట్ర మొత్తం ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో, ఓంకార డమరుక నాదాలతో మారుమోగుతూ మహాదేవుడిని ప్రార్థించాలని మంత్రి కోరారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పై, రాష్ట్ర ప్రభుత్వంపై, రాష్ట్ర ప్రజలందరిపై ఆ పరమశివుని దివ్య ఆశీస్సులు నిండుగా ఉండాలని, ఈ మహాశివరాత్రి సకల శుభాలు అందించాలని మనసారా కోరుకుంటున్నట్లు మంత్రి చెప్పారు.

# చెత్త తరలింపు వాహన ట్రిప్పుల సంఖ్యను పెంచండి : అధికారులకు కమిషనర్ ఆదేశం

శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు ఫిబ్రవరి 25నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించే వాహనాల ట్రిప్పుల సంఖ్యను మరింతగా పెంచాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 9వ డివిజన్ బంగ్లా తోట, యనమల పాలెం, ఎఫ్.సి.ఐ కాలనీ, నజీర్ తోట తదితర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రజా పార్కులలో నెడ్ క్యాప్ పథకం కింద అవసరమైన అన్ని మౌలిక వసతులు, చిన్నపిల్లల క్రీడా పరికరాలు, వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ అభిప్రాయ సేకరణలో అడ్మిన్ సెక్రటరీలు చురుకుగా పాల్గొని సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో గతంలో ఫ్లోర్ పాయింట్లుగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసి, నీటితో కడిగి, ముగ్గులతో అలంకరించి, పూల మొక్కలను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. ఇదే విషయమై గతంలోనూ పలుమార్లు సూచనలు చేసినప్పటికీ చర్యలు తీసుకోనందుకు కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ను సందర్శించి తాగునీటి నాణ్యత ప్రమాణాలను కమిషనర్ పరీక్షించారు. వాటర్ ట్యాంక్ ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని కమిషనర్ ఆదేశించారు.భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై ప్రజలందరికీ అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ డ్రైనేజీ కనెక్షన్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ప్రధాన డ్రైన్ కాలువలు, స్థానిక పంట కాలువలను భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానించే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. భవన నిర్మాణ సామాగ్రి రోడ్లను ఆక్రమించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్ల మీద అనధికారికంగా పార్కింగ్ చేసియున్న వాహనములను గమనించిన కమిషనర్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సహాయముతో వాటిని తొలగించావలసినదిగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదే విధంగా నిర్మాణం అనంతరం మిగిలిన వ్యర్థాలను రోడ్లపై ఉంచరాదని యజమానులకు తెలియజేసి తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా అపార్ట్ మెంట్ నిర్మాణం కోసం



రోడ్డును ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక నిర్మాణాన్ని గమనించిన కమిషనర్, వెంటనే ఆ నిర్మాణాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా స్థానికంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు నిర్మాణంలో ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ పై వెంటనే మూతలను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి, స్థలాలను శుభ్రపరచుకునేలా హెచ్చరించాలని, అలా చేయని పక్షంలో భారీ జరిమానాలను విధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. అల్లీపురం డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్న చెత్త సేకరణ ట్రాక్టర్ పైన వ్యర్థాలను కప్పి ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిని గుర్తించి కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా సమయంలో తప్పని సరిగా వాహనాలలోని వ్యర్థాలు కప్పబడి వలలు ఉండేలా తగిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెత్త తరలింపు వాహనాల ట్రిప్పుల సంఖ్యను మరింతగా పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, డంపింగ్ యార్డ్ లో అదనపు సిబ్బందిని నియమించుకొని ప్రణాళికబద్ధంగా వ్యర్థాలను డంపు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. చెత్త సేకరణ వృత్తి దారులను గుర్తించి వారి పిల్లలను సి.డి.పి.ఓ ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో జాయిన్ చేయించాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు.

# హైస్కూల్ ను, మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దుతాం :కలెక్టర్ ఆనంద్

శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు ఫిబ్రవరి 25×మహ్మదాపురం హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం పొదలకూరు మండలం మహ్మదాపురం గ్రామంలో దొడ్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా నిర్మించిన దొడ్ల శంకరమ్మ హాస్టల్ బ్లాక్‌ను కలెక్టర్ సమక్షంలో ప్రభుత్వానికి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల్లో దొడ్ల కుటుంబం సేవలను కొనియాడారు. జిల్లాలోనే ఒక ఆదర్శ పాఠశాలగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. హాస్టల్, పక్కనే వున్న జడ్పీ హైస్కూల్, ఎస్‌సి, బిసి వసతి గృహాలను ఒక మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి మోడల్‌స్కూల్‌గా తయారుచేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆధునాతన కంప్యూటర్ ల్యాబ్స్, విశాలమైన క్రీడా మైదానంలో వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్ కోర్టులు, మోడల్ కిచెన్ వంటి అత్యాధునిక వసతులను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఒక మంచి పాఠశాల ఏర్పాటు చేసేందుకు దాతలు, గ్రామస్థులు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ తమ వంతు ప్రయత్నంగా పాఠశాల అభివృద్ధికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా కూడా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుమారు 800 నుంచి వెయ్యిమంది



విద్యార్థుల సంఖ్య ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులకు సూచించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులందరికీ అనుకూలంగా వసతిగృహాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రెండు, మూడేళ్లలోనే మహ్మదాపురం హైస్కూల్‌ను అత్యున్నత ప్రమాణాలతో మోడల్ స్కూల్‌గా తయారుచేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఏదైనా చేయాలనే తపన వున్న కలెక్టర్ జిల్లాకు రావడం మన అదృష్టంగా చెప్పారు. తాను ఇప్పటివరకు సుమారు 10మంది వరకు కలెక్టర్లను చూశానని, వారందరి కంటే చిన్నవయస్కుడైనా



కమిట్‌మెంటు వున్న కలెక్టర్ ఆనంద్ అని కొనియాడారు. దొడ్ల శంకరమ్మ పేరుతో హాస్టల్ భవనాన్ని నిర్మించి కలెక్టర్‌కు అప్పజెప్పడం చాలా సంతోషంగా వుందన్నారు. కలెక్టర్ సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు.తొలుత పాఠశాలకు విచ్చేసిన కలెక్టర్‌కు దొడ్ల కుటుంబసభ్యులు, స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ హాస్టల్ గదులను, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ బిల్డింగ్ నిర్మాణదాతలు, దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి, దొడ్ల డెయిరీ ఎండి దొడ్ల సునీల్‌రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీ, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారులు వెంకటసుబ్బమ్మ, శోభారాణి, గోపాల్‌రెడ్డి, స్థానిక గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు

# జాయిన్ అయ్యిన తక్షణమే పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ

# పంచాయతీ కార్యదర్శుల విధుల్లో మార్పు రావాలి,లేదంటే చర్యలు తప్పవ్..!

### నోటీసులే కదా అని నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోనూ... పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసిన ఇంచార్జ్ ఎంపీడీవో గోపి

కోట ఫిబ్రవరి 25 (శ్రీచక్ర) : పంచాయితీ కార్యదర్శుల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో గోపి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.కోట మండలం ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయ పరిస్థితి దారుణంగా ఉంది.ఈ నేపథ్యంలో మండలంలోని 21 గ్రామ పంచాయతీలు ఉండడం అందరికీ తెలిసిందే.పంచాయతీల్లో కొంతమంది అందుబాటులో ఉండరు అందుబాటులో ఉన్న వారు చేయవలసినపని చేయరనే నానుడి ఉందని పలువురు అంటున్నారు.ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో వేణు పంచాయతీ కార్యదర్శుల వ్యవహార శైలి పై మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పి4 సర్వే( కుటుంబ యజమాని వివరాలు) ఎమ్మెస్ ఎం ఇ సర్వే (యజమాని వృత్తి విధానాలు),చిల్డ్రన్ ఆధార్ సర్వే (ఆధార్ లేని చిన్న పిల్లలకు ఆధార్ ఉండే విధంగా )లు చేయమని ఆదేశాలు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శుల విధుల్లో నిర్లక్ష్యం ఎక్కువగా






ఉందన్నారు.అందులో భాగంగా డి ఎల్ డి ఓ వాణి రెడ్డి పర్యవేక్షణలో భాగంగా కోట ఎంపీడీవో కార్యాలయమునకు రావడంతో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో ఆ ముగ్గురకు (కేశవరం,చిట్టేడు,కోట-1) నోటీసులు జారీ చేయడమే కాకుండా మంగళవారం రోజున స్థానిక ఎంపీడీవో గోపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జూమ్ మీటింగ్ కు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు అటెండ్ కాకపోవడంతో (గూడలి,కోట-3 )ఇద్దరు కు కూడా నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.అంతేకాకుండా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేరు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తుందన్నారు. దీనితో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇంచార్జ్ ఎంపీడీవో గోపి ఐదుమంది పంచాయితీ కార్యదర్శులకు షో కాజ్ నోటీసులు ఇచ్చారంటే కోట మండలంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందన్నారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఎక్కువమంది ఉండడం పై పలు రకాలుగా విమర్శలు తలెత్తుతున్నాయి.అత్యవసర ఖర్చులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీకి మౌలిక వసతుల కల్పన నేపథ్యంలో 14,15 ఫైనాన్స్ ద్వారా నగదు విడుదలచేసిందని సమాచారం. అయితే నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో గోపి ఎంపీడీవో కార్యాలయానికి ఎలాంటి మార్పు తీసుకొస్తారా అనే కోణంలో మండల ప్రజలు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శుల సర్వేలో భాగంగా సోమవారానికి 16% రోజునే 40 శాతానికి పెరిగిందన్నారు.ఏదేమైనప్పటికీ పంచాయతీ కార్యదర్శుల పనితీరు మార్చుకోకపోతే నిబంధనల ప్రకారం సస్పెండ్ చేస్తామన్నారు.

# ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఫిర్యాదు

### ఆర్.ఎం.పి డాక్టర్ పై. ల్యాబ్ పై స్పందనలో ఫిర్యాదు నివేదికను జిల్లా వైద్య అధికారులకు పంపిస్తాం వైద్య అధికారి వెల్లడి

సంగం ఫిబ్రవరి 25 ( శ్రీ చక్ర.).సంఘం పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి ఆర్ఎంపీ డాక్టర్ ల్యాబ్ యజమాని కలిసి మోసాలకు పాల్పడుతున్నారని విచారణ జరిపి న్యాయం చేయాలని స్పందనలో సోమవారం సంఘం కి చెందిన కొందరు ఫిర్యాదు చేయడం జరిగింది. మంగళవారం సంఘం మెడికల్ అధికారి మరో ముగ్గురు అధికారులు కలిసి విచారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా వెళ్ళినటువంటి వైద్య అధికారులు వస్తున్న సంగతి గమనించిన ఆర్ఎంపీ డాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఆర్ఎంపి డాక్టర్ యొక్క విధి విధానాలను తాను పాటిస్తున్నానని ఎవరికి వైద్యం చేయడం లేదని నిబంధనలకు వ్యతిరేకంగా వైద్య సేవలు అందించడం లేదని ఆర్ఎంపీ డాక్టర్ తెలిపారు. ల్యాబ్ యజమాని మాత్రం అతను వద్ద పనిచేస్తున్నటువంటి నాలుగు మిషన్లు ఏ ఒక్కటి సక్రమంగా ఉపయోగించడం లేదని విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు. ఇది ఎలా ఉండగా ఆర్ఎంపీ డాక్టర్ నలుగురు నర్సులను పెట్టుకొని



ఒక మందుల షాపు ఉపయోగిస్తూ సొంతంగా వైద్య సేవలు చేస్తున్నది స్థానిక ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఈయన నిజాయితీగా పనిచేసే వ్యక్తి అయితే ఆయనకు ఉన్నటువంటి సర్టిఫికెట్లు గాని ఆయనకు సంబంధించినటువంటి వివరాలు గానీ వచ్చినటువంటి అధికారులు విచారణలో ఎటువంటి లోపం లేదు అన్నట్లుగా తేల్చారని బాధితులు తెలుపుతున్నారు. ఈ ఆర్ఎంపీ డాక్టర్ వల్ల సంఘం ఏఎస్పేట మండలాలకు చెందిన అనేకమంది చనిపోయి ఉన్నారన్న వాస్తవాలు కూడా స్థానికులు తెలుపుతున్నారు అయితే వైద్య అధికారులు విచారణలో మాత్రం తాను బుద్ధిమంతుడిగా వ్యవహరించారని ఇందుకు నిదర్శనం ఎంతకీ అమ్ముడుపోయా రా. లేక డిఎండిహెచ్వో ఆఫీస్ నుంచి సిబ్బంది ఆర్ఎంపీ డాక్టర్ పై ల్యాబ్ టెక్నీషియన్ యజమానిపై విచారణ మాత్రం చేసి నివేదిక తమకు పంపించాలని ఆదేశించడం మరోపక్క అనుమానాలకు వ్యక్తం చేస్తున్నాయి. ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినటువంటి బాధితులను విచారణ సమయంలో రావద్దని సంఘం వైద్య అధికారి చెప్పడం ఎంతవరకు న్యాయమని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఒక ఆర్ఎంపీ డాక్టర్ కి భయపడి రావద్దని ఆర్ఎంపీ డాక్టర్లు దెబ్బకి వైద్య అధికారులు అబ్బ అనిపించే విధంగా విచారణ చేశారని బాధితులు తెలుపుతున్నారు. వాస్తవాలు పక్కన పెట్టి కేవలం ఆర్ఎంపి ల్యాబ్ యజమాని చెప్పినటువంటి సమాచారాన్ని ఎండా?స్మెంట్గా ఎలా ఇస్తారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులే ప్రాణాలు తీసేటటువంటి వైద్యులకు సహాయాలు అందిస్తున్నట్లుగా విచారణలో తేల్చారే తప్ప న్యాయం జరగలేదని బాధ్యతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా డిఎంహెచ్వో స్పందించి విచారణ చేసి ల్యాబ్ని ఆర్ఎంపి వైద్యశాలను సీజ్ చేయాల్సిందిగా బాధ్యతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నిరాడంబరతకు ప్రతిరూపం మహాశివుడు ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ



శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు ఫిబ్రవరి 25నిరాడంబరతకు ప్రతిరూపం మహాశివుడని, సర్వ మానవాళికి శివతత్వం సదా ఆచరణీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విశ్వం మొత్తం శివమయమని, ఆ మహాదేవుని ఆశీస్సులతో, పంచాక్షరి మంత్రం ఓం నమశ్శివాయ ఓంకార నాదంతో ప్రజల జీవితాలు ఆనందమయం కావాలని ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పై, రాష్ట్ర ప్రభుత్వంపై, రాష్ట్ర ప్రజలందరిపై ఆ పరమశివుని దివ్య ఆశీస్సులు నిండుగా ఉండాలని, ఈ మహాశివరాత్రి సకల శుభాలు అందించాలని మనసారా కోరుకుంటున్నట్లు మంత్రి చెప్పారు.

## మార్చి 8న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్.



ఏలూరు ఫిబ్రవరి 25( శ్రీచక్ర)రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం మార్చి 8వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనము నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 వ సంవత్సరానికి మొదటి జాతీయ లోక్ అదాలత్ మార్చి 8వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 10 మండల లీగల్ సర్వీసెస్ కమిటీల నందు మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నందు నిర్వహిస్తున్నామని ఈ జాతీయ లోక్ అదాలత్ నందు ఈరోజు వరకు 2012 క్రిమినల్ కేసులను, 2341 సివిల్ కేసులను అలాగే 2795 ప్రీలికేషల కేసులను రాజీ యోగ్యమైన కేసులగా గుర్తించడం జరిగిందని, కేసులలో మధ్యవర్తిత్వం ద్వారా మంగళవారం వరకు 154 కేసులను రాజీ చేయడం జరిగిందని తెలియజేశారు. అలాగే మిగిలిన కక్షిదారులు కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను కానీ, మండల న్యాయ సేవ అధికార సంస్థలు గాని సంప్రదించి తమ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని కేసుల నుండి విముక్తి కాగలరని సూచించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు మద్దతుగా చప్పిడి ప్రచారం ...!

### పట్టభద్రులైన ఓటర్లకు డాక్టర్ చప్పిడి విజ్ఞప్తి.



కాజులూరు, ఫిబ్రవరి 25(శ్రీచక్ర)పట్టబదులైన ఓటర్లు విజ్ఞతతో ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబుత్తుల రాజశేఖర్ కు ఓటు చేయాలని రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. మండలం కేంద్రమైన కరప గ్రామంలో మండల అధ్యక్షులు దేవు వెంకన్న మండల మహిళా అధ్యక్షురాలు కోన వెంకటలక్ష్మి బిజెపి నాయకులు కోటికలపూడి దుర్గారావు జనసేన కార్యకర్తలు తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం మంచి పనులు అనేకం చేస్తుందని డీఎస్సీ త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రకటిస్తారని అలాగే గుంతలు లేని రోడ్లు చేసిన మన మంచి కూటమి ప్రభుత్వం బలపరిచిన రాజశేఖర్ ను మనం గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని మంచివాడు ఉదార స్వభావుడు మనందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి శ్రీ రాజశేఖర్ కి పట్టభద్రులందరూ మంచి మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ చప్పిడి ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రభుత్వ భూములు, ఆస్తులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఉంది.

### సిసిఎల్ ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి. నాగరాణి

భీమవరం ఫిబ్రవరి 25 (శ్రీచక్ర)అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సి సి ఎల్ ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు.ప్రభుత్వ భూములన్నిటిని పూర్తిస్థాయిలో గుర్తించడానికి రీ సర్వే చేయాలని జయలక్ష్మి ఆదేశించారు. రీ సర్వే చేస్తున్న సిబ్బంది సకాలంలో హాజరయ్యేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందరికీ గృహాలు కార్యక్రమాన్ని కలెక్టర్లు సమర్ధంగా చేపట్టాలని ఆమె సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నమోదయ్యే అర్జీలను పున పరిశీలన చేయాలన్నారు. భూముల రీ సర్వే, తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్లతో ఆమె చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారు జాషువా పాల్గొన్నారు.

# శివ భక్తుల దివ్యక్షేత్రం మన శ్రీకాళహస్తి..మంత్రి ఆనం

శ్రీకాళహస్తి 25-02-2025శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామికి ప్రభుత్వం తరపున పట్టువస్త్ర సమర్పణశ్రీచక్ర ప్రతినిధి శ్రీకాళహస్తి ఫిబ్రవరి 25శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వైభవంగా జరుగు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తరఫున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కలిసి శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి చేరుకున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఈవో బాపిరెడ్డి , దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.. తదనంతరం మంత్రి ఆనం స్థానిక శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తో కలిసి స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించి, రాష్ట్ర ప్రజల క్షేమాభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించారు . ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ : శ్రీకాళహస్తి ఆలయం దేశవ్యాప్తంగా శివ భక్తులకు ఆధ్యాత్మికంగా కీలక కేంద్రంగా ఉన్నదని, ప్రభుత్వం తరఫున మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు.మహాశివరాత్రి





సందర్భంగా స్వామివారి దర్శనార్థం లక్షలాది మంది భక్తులు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాన్ని సందర్శించుకోవడం, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంది అని, భక్తులు మనోభావాలకు కాపాడటానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడు పెద్దపీట వేస్తుందని మంత్రి తెలిపారు. రేపు మహా శివరాత్రి పర్వదినం కావడం తో భక్తులు రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటం తో ఏర్పాట్లు అదనంగా ఉండేలా చొరవ తీసుకోవాలని మంత్రి అధికారులుకు ఆదేశాలు జారీ చేశారు. క్యూ లైన్ విషయం లో, ప్రత్యేక దర్శనం విషయం లో, వసతి సదుపాయాలు, పారిశుధ్య పనులు ఎప్పటికి అప్పుడు పర్యవేక్షణ చేయాలనీ అలాగే విధి నిర్వహణ కోసం వచ్చిన అధికారులు కూడా ఒకరి ఒకరు సహకరించుకుంటూ శాఖల మధ్య సమన్వయం తో కలిసి కట్టుగా పని చేసి ఏ ఒక్క భక్తుడు కూడా ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ విష్ణు వర్ధన్ రాజు, రెవిన్యూ డివిజన్ అధికారి భాను ప్రకాష్ రెడ్డి మరియు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకర పరిశ్రమలలో భద్రతా నిర్వహణపై యాజమాన్యాలు పూర్తి శ్రద్ధ వహించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం ఫిబ్రవరి 25( శ్రీ చక్ర )మంగళవారం స్థానిక విష్ణు కాలేజీ మిని ఆడిటోరియం నందు ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో "ప్రమాదకర పరిశ్రమలలో భద్రతా నిర్వహణ" పై ఏర్పాటుచేసిన ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని పరిశ్రమల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. ఉద్యోగులలో పారిశ్రామిక భద్రత రంగంలో అవగాహన కల్పించడం, భద్రతా సంస్కృతిని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పారిశ్రామిక భద్రతా శిక్షణ యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పి, రాష్ట్రంలో ఇటీవల జరిగిన పెద్ద ప్రమాదం గురించి వివరించారు. పరిశ్రమల ప్రతినిధులు ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని అనుసరించాలని, భద్రతా కమిటీ సమావేశాలను నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరగక ముందే అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీల శాఖతో కలిపి ఏర్పాటుచేసిన అధికారుల బృందం ప్రతి పరిశ్రమలను తరచూ తనిఖీలను నిర్వహించి లోటుపాట్లను యాజమాన్యాలకు తెలియజేయాలన్నారు. ప్రమాదం జరిగిన సందర్భంలో వ్యవహరించవలసిన ప్రొసీజర్ ను ఉద్యోగులకు శిక్షణ అందజేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే తనిఖీ బృందం 90% పరిశ్రమలను స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీ చేసి ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఎత్తయిన ప్రదేశాల్లో పని చేసేవారు కచ్చితంగా సరైన జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పరిశ్రమల ద్వారా






ఒక్క యాక్సిడెంట్ కూడా నమోదు కాలేదని, ఇలానే రానున్న రోజుల్లో జిల్లాను ఎప్పటికీ జీరో యాక్సిడెంట్స్ స్థానంలో ఉండేలా యాజమాన్యాలు తగిన శ్రద్ధ వహించాలని తెలిపారు. పరిశ్రమల యాజమాన్యం, సిబ్బంది సేఫ్టీ పద్ధతులను అలవాటు చేసుకోవాలని తెలిపారు. విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు ప్రమాదాల నివారణకు భద్రతా సంస్కృతిపై నొక్కి చెప్పారు.జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, వాన్బరీ లిమిటెడ్ డైరెక్టర్ ప్రభాకర్ లు వివిధ భద్రతా చర్యలను తెలియజేశారు.వివిధ పరిశ్రమల భద్రతా అధికారులు తమ తమ పరిశ్రమలలో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను ఈ వర్క్ షాప్ లో పంచుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రమాదకర పరిశ్రమల నుండి సుమారు 120 మంది ఉద్యోగులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత కరం ఏజెన్సీ ప్రదర్శించిన వివిధ సిబ్బంది రక్షణ పరికరాలను జిల్లా కలెక్టర్, ఇతర ప్రముఖులు సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, వాన్బరీ లిమిటెడ్ డైరెక్టర్ ప్రభాకర్, వెస్ట్ గోదావరి ఫ్యాక్టరీల ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణ, వాన్బరీ లిమిటెడ్ లీడ్ ఆడిటర్ వై.శ్రీను, తణుకు ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ హెడ్ సేఫ్టీ ఎంఎస్వి రామకృష్ణ , జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మోడ్రన్లో స్ఫూర్తిదాయకంగా రుద్రయ్య చౌదరి వర్ధంతి





రామచంద్రపురం , ఫిబ్రవరి 25(శ్రీచక్ర) ప్రముఖ విద్యావేత్త డాక్టర్ గరిగిపాటి రుద్రయ్య చౌదరి వర్ధంతి కార్యక్రమం మంగళవారం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో స్ఫూర్తిదాయకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రుద్రయ్య చౌదరి శిష్యుడు, ప్రముఖ విద్యావేత్త, ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోడరన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి .వెంకటేశ్వర్లు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ చెలికాని స్టాలిన్, ప్రముఖ నాయకుడు గరికపాటి సూర్యనారాయణమూర్తి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. తొలుత గరికపాటి రుద్రయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభాధ్యక్షుడు పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్ట్స్ గ్రూప్ యొక్క ప్రాధాన్యత తగ్గటం విద్య రంగానికి శ్రేయస్కరం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్ గ్రూపులతో పాటు ఆర్ట్స్ గ్రూపులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అప్పుడే విద్యా వ్యవస్థలో సమతుల్యత ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి.రావు రూపొందించిన డాక్టర్ గరిగిపాటి రుద్రయ్య చౌదరి.ఒక మరపురాని జ్ఞాపకం మని అన్నారు.విద్యా భారతి సేవలో విశిష్ట అంకం అనే కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా గరికపాటి రుద్రయ్య చౌదరి గౌరవార్థం మోడరన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం డాక్టర్ సి. స్టాలిన్ మాట్లాడుతూ తన భావజాలాన్ని విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగించిన గొప్ప విద్యావేత్త రుద్రయ్య చౌదరి అని గుర్తు చేసారు. పి వెంకటేశ్వర్లు పేర్కొన్నట్లుగా ఆర్ట్స్ గ్రూప్ ప్రాధాన్యతను అందరు గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా మోడరన్ అధినేత జి. వి. రావు మాట్లాడుతూతమ మోడరన్ జూనియర్ కాలేజీ గరిగిపాటి రుద్రయ్య చౌదరి పేరు మీదగా నిర్వహించడం తమకు దక్కిన అదృష్టమని పేర్కొన్నారు. ప్రముఖ విద్యావేత్త శేషారెడ్డితో తనకు చిరకాల పరిచయం ఉందన్నారు. అనేక విషయాల్లో శేషారెడ్డి నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం పబ్లిక్ పరీక్షలలో టౌన్ పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రుద్రయ్య చౌదరి ఎండోమెంట్ ట్రస్ట్ తరఫున నగదు పురస్కారాలు అందజేశారు. మోడరన్ జూనియర్ కాలేజ్ విద్యార్థులైన పి. భారతి,కె. రమ్య, జి. చంద్రిక, అశ్వక్ తో పాటు మోడరన్ డిగ్రీ కాలేజీ విద్యార్థిని కె. ఆర్.మహాలక్ష్మి ఈ పురస్కారాలు దక్కించుకున్నారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు ఆధ్వర్యంలో ముఖ్య అతిథి నల్లమిల్లి శేషారెడ్డికి "ఆదిత్య మహారధి కేరాఫ్ విద్యా వారధి" పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థల యూనివర్సిటీగా రూపాంతరం చెందడంలో రుద్రయ్య చౌదరి భావజాలం తనకు ఉపకరించిందని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉపాధితో కూడిన కోర్సులలో చేరడానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కాలానుగుణంగా విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను స్వాగతించాలన్నారు.మోడరన్ జి. ఆర్. సి. కాలేజీ ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్ మాట్లాడుతూ గరిగిపాటి రుద్రయ్య చౌదరి పేరు మీద నడుస్తున్న తమ కళాశాలలో అత్యధిక మార్కులు ర్యాంకులు రావడం హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త జె.దుర్గాప్రసాద్, డాక్టర్ సి. రామారావు తదితరులు పాల్గొన్నారు.



## కోలంకలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తులకు మద్దతుగా మాజీ మంత్రి చిక్కాల ప్రచారం...!



కాజులూరు, ఫిబ్రవరి 25 (శ్రీచక్ర)జనసేన పార్టీ కాజులూరు మండల అధ్యక్షులు బొండా వెంకన్న ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు లు పలువురు కూటమి శ్రేణులతో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు మద్దతుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు .కాజులూరు మండలం కోలంక గ్రామంలో పంచాయతీ కార్యాలయం, తో పాటు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలు, హైస్కూల్, ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం, ప్రైవేటు పాఠశాలలు , తదితర చోట్ల గ్రేడియుయేట్ ఓటర్లను కలిసి కరపత్రాలు అందజేశారు.అలాగే గ్రాడ్యుయేట్ ఓటర్లు ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి పార్టీల అభ్యర్థి పెరబతుల రాజశేఖర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కోలంక,పల్లిపాలెం,పెదలంక , నామావనిపాల్లెం గ్రామాల ఎన్డీఏ కూటమికి చెందిన నాయకులు పలువురు పాల్గొన్నారు.

## కూటమి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి కి మొదటి ప్రాధాన్యత ఓటును ఇవ్వండి ...!

### పాయకరావుపేట నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ చప్పిడి

కాజులూరు, ఫిబ్రవరి 25 (శ్రీచక్ర) కూటమి బలపరిచిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ కి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులను కోరారు. మృదుస్వభావి మంచివాడు రఘువర్మ గెలిపిస్తే మీ అందరికీ అందుబాటులో ఉంటూ మీకు మంచి సేవలు అందిస్తారనిడాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. కోట కొరట్ల మండలం కోట కొరట్ల గ్రామంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున మండల అధ్యక్షులు జానకి శ్రీను ఉపాధ్యాయ నాయకులు జనసేన బిజెపి కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతినెల 1వ తారీకు జీతాలతో పాటు మీ యొక్క న్యాయమైన కోరికలు ఏమైనా ఉంటే అవి ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం తీరుస్తుందని అలాగే మన నియోజకవర్గ ఎమ్మెల్యే ,హోంమంత్రి వంగలపూడి అనిత కూడా మీకు తోడుగా ఉంటారని ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి తెలియజేశారు .ఈనెల 27వ తారీఖున జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపాధ్యాయులందరూ మీ మొదటి ప్రాధాన్యత ఓటును ఇచ్చి వర్మ ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు డాక్టర్ చప్పిడి విజ్ఞప్తి చేశారు.



# స్పోర్ట్స్ న్యూస్

## వన్డేల్లో విరాట్ కంటే బెటర్ ప్లేయర్‌ని చూడలేదు.. కోహ్లీపై ఆసిస్ మాజీ కెప్టెన్ పాంటింగ్ ప్రశంసల జల్లు..!




భారత స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. వన్డేల్లో విరాట్ కంటే బెటర్ ప్లేయర్‌ను చూడలేదని పేర్కొన్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ టెండూల్కర్ రికార్డును విరాట్ అధిగమిస్తాడని పాంటింగ్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇటీవల ఫామ్ లేమితో ఇబ్బందులుపడుతున్న విరాట్.. చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్‌పై అజేయ సెంచరీ చేశాడు. ఇది వన్డేల్లో విరాట్‌కు 51వ సెంచరీ కావడం విశేషం. ప్రస్తుతం వన్డేల్లో సచిన్ రికార్డును అధిగమించేందుకు కేవలం 4వేల పరుగులు దూరంలో ఉన్నాడు. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో 14వేలు మైలురాయిని అందుకున్న మూడో ప్లేయర్ విరాట్ కాగా.. వన్డేల్లో అత్యంత వేగంగా పరుగులు చేసిన ప్లేయర్‌గా రికార్డును నెలకొల్పాడు.ఇంతకు ముందు టీమిండియా, శ్రీలంక దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర మాత్రమే ఈ ఘనతను సాధించారు. కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో 14,085 పరుగులు చేయగా.. సచిన్ కంటే 4,341 పరుగులు వెనుకంజలో ఉన్నాడు. వన్డేల్లో 18,426 పరుగులు చేసిన ప్లేయర్‌గా రికార్డు సచిన్ పేరిట ఉన్నది. ఈ ఓ కార్యక్రమంలో రికీ పాంటింగ్ మాట్లాడుతూ వన్డేల్లో విరాట్ కంటే మంచి ఆటగాడిని తాను చూడలేదని చెప్పాడు. ఇంకా పరుగులు చేయాలనే తపన కోహ్లీకి ఉందని.. అదేం అసాధ్యమైన పని కాదని చెప్పాడు. శారీరకంగా ఇంకా ఫిట్‌గా ఉన్నాడని.. ఆట కోసం కష్టపడుతున్నాడని తెలిపాడు. చాలాకాలంగా బాగానే రాణిస్తున్నాడని.. సచిన్ రికార్డును అధిగమించేందుకు ఇంకా 4వేల పరుగులు మాత్రమే చేయాలన్నాడు.సచిన్ గొప్ప బ్యాట్స్‌మెన్ అని.. అతను సుదీర్ఘం కాలం క్రికెట్ ఆడడం వల్లే అన్ని పరుగులు చేయగలిగాడని పేర్కొన్నాడు. కోహ్లీలాంటి ఆటగాడిని విస్మరించలేరని.. అతనిలో ఇంకా పరుగులు చేయాలన్న తపన ఉందన్నాడు. పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో బెస్ట్ ఇస్తాడని.. అతనో మ్యాచ్ విన్నింగ్ ప్లేయర్‌గా అభివర్ణించాడు. 2022 టీ20 ప్రపంచ కప్, తాజాగా పాక్‌పై రాణించాడని గుర్తు చేశాడు. పాక్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. టాప్ ఆర్డర్‌లో విరాట్‌లాంటి మ్యాచ్ విన్నింగ్ ప్లేయర్ అవసరమని చెప్పాడు. దుబాయి పిచ్‌పై విరాట్ సెంచరీ చేశాడని.. పాక్‌కు చెందిన స్టార్ ప్లేయర్స్ ఎవరూ భారీ స్కోర్ చేయకుండానే పెవిలియన్‌కు చేరారని గుర్తు చేశాడు. అయితే, ఏ ఫార్మాట్‌లోనైనా హాఫ్ సెంచరీ మిమ్మల్ని.. జట్టును గెలిపించదని తాను ఎప్పుడూ చెబుతూనే ఉంటానని.. తప్పనిసరిగా భారీ స్కోర్ చేయాలని చెప్పాడు.

## కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ బాధ్యతలు స్వీకరించేందుకు రెడీగా ఉన్నా: వెంకటేశ్ అయ్యర్





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఎఖఒ)లో రాబోయే సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును కెప్టెన్‌గా నడిపించాలని ఉందని ఆ జట్టు ఆల్ రౌండర్ వెంకటేశ్ అయ్యర్ కోరికను వ్యక్తం చేశాడు. తనకు కెప్టెన్‌గా అనుభవం లేదని.. అయినా జట్టును నడిపించే అవకాశం వస్తే అందుకు సిద్ధంగా ఉంటానని తెలిపాడు. ఐపీఎల్ ఈ ఏడాది మార్చిలో ప్రారంభం కానున్నది. తొలి మ్యాచ్‌లో డిపెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, బెంగళూరు జట్టును ఢీకొట్టనున్నది. అయితే, కేకేఆర్ జట్టుకు కెప్టెన్ లేదు. ఇప్పటి వరకు ఎవరికి జట్టు పగ్గాలు అప్పగిస్తుందనే విషయాన్ని వెల్లడించలేదు. శ్రేయాస్ అయ్యర్ గత సీజన్‌లో కేకేఆర్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు.అయ్యర్‌ను కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. జెడ్డా వేదికగా జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ జట్టు అయ్యర్‌ను భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. కెప్టెన్సీపై వెంకటేశ్ అయ్యర్ మాట్లాడుతూ.. జట్టు పగ్గాలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించాడు. తాను ఎప్పుడూ ఇదే చెబుతున్నానని.. కెప్టెన్సీ అనేది ఒక ట్యాగ్ మాత్రమేనన్నారు. నాయకత్వంపై నమ్మకం ఉంచుతానని.. కెప్టెన్సీ అనేది పెద్ద రోల్ అని పేర్కొన్నారు. దానిపై ఎలాంటి అస్పష్టత లేదనని చెప్పాడు. తనకు అవకాశం వస్తే.. ఖచ్చితంగా చేస్తానని.. చేయకపోవడానికి ఎలాంటి కారణం లేదని తెలిపాడు. ఇంకా మాట్లాడుతూ కెప్టెన్ మంచి రోల్ మోడల్‌గా నిలువాలని వెంకటేశ్ పేర్కొన్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లో నాయకుడిగా ఉండేందుకు కెప్టెన్ అనే ట్యాగ్ అవసరం లేదని.. ఒక ఉదాహరణగా ఉండాలని చెప్పాడు.ప్రస్తుతం తాను మధ్యప్రదేశ్‌లో ఉన్నానని.. మైదానంలో, బయట మంచి రోల్ మోడల్‌గా ఉండానని.. తాను మధ్యప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌ని కాదని.. కానీ, నా అభిప్రాయాన్ని గౌరవిస్తారని చెప్పాడు. ఎవరైనా అభిప్రాయాన్ని వ్యక్తీకరించే స్వేచ్ఛ ఉండే వాతావరణంలో జీవించడం తనకు ఇష్టమని చెప్పారు. అందరికీ అభిప్రాయాలు, సూచనలు ఇచ్చే స్వేచ్ఛ ఉండాలని.. వాటిని సరైన స్ఫూర్తితో తీసుకోవాలని చెప్పాడు. ఇదిలా ఉండగా.. కేకేఆర్ జట్టు 2021లో కేకేఆర్‌లో చేరిన వెంకటేశ్ అయ్యర్‌ను గతేడాది వేలానికి ముందు రిలీజ్ చేసింది. కానీ, ఆర్‌సీబీతో వేలంలో పోటీపడి రూ.23.75కోట్లకు తిరిగి కొనుగోలు చేసింది. అయ్యర్ 51 ఐపీఎల్ మ్యాచుల్లో 1,326 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు అన్ని మ్యాచ్‌లను కేకేఆర్ తరఫునే ఆడాడు.


## ఆస్ట్రేలియా పర్యటనలో విఫలం.. కోహ్లీని నిలదీసిన సెలెక్టర్లు!




ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత సెంచరీతో విమర్శకుల నోళ్లు మూయించాడు. ఆఖరి వరకు క్రీజులో నిల్చొని భారత విజయలాంఛనాన్ని పూర్తి చేసిన కోహ్లీ.. కీలక మ్యాచ్‌ల్లో రాణించే సత్తా ఇంకా తనలో ఉందని చాటి చెప్పాడు. కానీ ఈ టోర్నీకి ముందు ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ఫామ్ కనబర్చిన విరాట్ కోహ్లీని సెలెక్టర్లు అతని భవితవ్యంపై ప్రశ్నించినట్లు తాజాగా ఓ నివేదిక పేర్కొంది.ఆసీస్ పర్యటనలో వరుసగా విఫలమవడంతో ఫ్యూచర్ ప్లాన్స్ ఏంటని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేరుగా కోహ్లీని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మెల్ బోర్న్ టెస్ట్ ఓటమి అనంతరమే కోహ్లీతో గవాస్కర్ చర్చించాడంట. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. సరిగ్గా ఈ ఘటనకు ముందే విరాట్ కోహ్లీకి గౌతమ్ గంభీర్ టెస్ట్ కెప్టెన్సీ ఆఫర్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. రోహిత్ శర్మ పేలవ ఫామ్ నేపథ్యంలో టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాలని కోహ్లీని గంభీర్ కోరినట్లు ప్రచారం జరిగింది.'ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్ట్‌లో టీమిండియా ఓడిన వెంటనే విరాట్ కోహ్లీని అజిత్ అగార్కర్ అతని ఫ్యూచర్ ప్లాన్స్ ఏంటని అడిగాడు. ఆ సమయంలో టీమిండియా ఆఖరి టెస్ట్ అయిన సిడ్నీ మ్యాచ్ కోసం సన్నదమవుతోంది. కోహ్లీ ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చీఫ్ సెలెక్టర్ అగార్కర్ మాత్రమే తెలుసుకునే ప్రయత్నం చేశాడు.'అని ఓ క్రికెట్ బ్లాగర్ పేర్కొన్నాడు. కెప్టెన్సీ ఆఫర్‌తో పాటు అజిత్ అగార్కర్ ప్రశ్నలపై స్పందించని కోహ్లీ.. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో సెంచరీ బాది అందరి సందేహాలకు సమాధానమిచ్చాడు. 'భారత సెలెక్షన్ కమిటీ అడిగిన ప్రశ్నలకు కోహ్లీ తన బ్యాటింగ్‌తోనే సమాధానం ఇచ్చాడు.'అని సదరు బ్లాగర్ పేర్కొన్నాడు.ఈ నివేదిక జట్టులోని అనిశ్చితితో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ కెరీర్ భవితవ్యంపై జరగుతున్న చర్చను వెలుగులోకి తీసుకొచ్చింది. ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపిక చేసిన జట్టు ప్రక్రియలో హెడ్ గౌతమ్ గంభీర్ కీలక పాత్ర పోషించాడు. రోహిత్ శర్మ ఫామ్‌పై తీవ్ర అసంతృప్తిగా ఉన్న అతను ఆఖరి టెస్ట్‌కు తుది జట్టు నుంచి తప్పించాడు. రోహిత్ శర్మ పీఆర్ టీమ్.. హిట్‌మ్యానే స్వయంగా తప్పుకున్నాడని ప్రచారం చేసినా.. అప్పటికే రోహిత్‌ను పక్కనపెట్టాలని గంభీర్ నిర్ణయించాడని టీమ్ వర్గాలు పేర్కొన్నాయి.




## భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్.. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దిగిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్..!




ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం పాకిస్థాన్, టీం ఇండియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దిగిన ఇద్దరు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా ఔత్సాహికుల బెట్టింగ్‌ను ప్రోత్సహించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాల్వియ నగర్‌లోని ఓ ఇంటిపై పోలీసుల బృందం దాడి చేసింది.ఆ ఇంట్లో ఆయాన్ (32), నిజాం అలియాస్ భుట్టో (45) లు ఔత్సాహికులను ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ప్రోత్సహిస్తూ దొరికి పోయారని ఢిల్లీ సౌత్ జోన్ డీసీపీ అంకిత్ చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. వారి వద్ద నుంచి బెట్టింగ్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బెట్టింగ్స్ ద్వారా రూ.13 లక్షల సొమ్మును సంపాదించినట్లు నిందితులు చెప్పారన్నారు. ఆ సొమ్ము కూడా జప్తు చేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని అంకిత్ చౌహాన్ వెల్లడించారు.

## పాకిస్తాన్ జట్టుపై టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సెటైర్లు..!

చాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్తాన్ జట్టు నిష్క్రమించింది. ఇంటా బయట ఆ జట్టుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజా భారత జట్టు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సైతం స్పందించారు. భారత బీ జట్టును ఓడించేందుకు సైతం పాకిస్తాన్ కష్టపడాల్సిందేనని గవాస్కర్ పేర్కొన్నారు. దుబాయి వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు పాకిస్తాన్‌ను ఆరు వికెట్ల తేడాతో ఓడించింది. డిపెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్తాన్ తొలుత న్యూజిలాండ్ చేతిలో పరాజయం పాలైంది. ఆ తర్వాత టీమిండియా చేతిలో చావుదెబ్బ తిన్నది.సోమవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను న్యూజిలాండ్ ఓడించింది. దాంతో పాకిస్తాన్ సెమీస్ ఆశలన్నీ అడియాశలయ్యాయి. టోర్నీలో ఇప్పటి వరకు పాక్ ఆడిన రెండు మ్యాచులు గెలువలేకపోయింది. ఇక చివరి గ్రూప్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 27న బంగ్లాదేశ్‌తో తలపడనున్నది. 1996 తర్వాత పాకిస్తాన్ తొలిసారి ఐసీసీ టోర్నీ జరుగుతుండగా.. ఒక్క మ్యాచ్ గెలువలేకపోయింది. పాక్ 2017లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీని నెగ్గింది. డిపెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగినా.. ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది.



ఈ సందర్భంగా టీమిండియా దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ పాక్‌కు భారత బీ జట్టు గట్టి పోటీ ఇస్తుందన్నారు. కానీ, పాక్ ఫామ్‌ను చూస్తే టీమిండియా బీ జట్టును ఓడించడం కూడా కష్టమేనన్నారు.పాక్‌లో ప్రతిభ ఉన్న ఆటగాళ్లు ఉన్నారని.. టెక్నిక్ బాగా లేకపోయినా.. బ్యాట్, బంతిపై అవగాహన ఉందని చెప్పారు. పాకిస్తాన్ సూపర్ లీగ్ (ఖూఒ), దేశీయ పరిమిత ఓవర్ల టోర్నమెంట్లు ఉన్నప్పటికీ.. పాకిస్తాన్ బెస్ట్ ఆటగాళ్ల కోసం ఇబ్బంది పడుతోందని గవాస్కర్ చెప్పారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత్ యువ ఆటగాళ్లను ఐపీఎల్‌తో సిద్ధం చేసిందని.. ఐపీఎల్ ఆటగాళ్లు రంజీలు, భారత్ కోసం ఆడుతున్నారన్నారు. దీనిపై పాకిస్తాన్ క్రికెట్ విశ్లేషించుకోవాలని సూచించారు. బెంచ్ ఎందుకు బలంగా లేదో చూసుకోవాలన్నారు.

## యువరాజ్ సింగ్ కొడుకును చూశారా ఇన్‌స్టాలో

ముంబై: మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ కుమారుడిని చూశారా? ముంబైలో జరుగుతున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో ఆ పిల్లోడు కనిపించాడు. యువీ భార్య హేజిల్ కీచ్ తన కొడుకును ఎత్తుకుని ఆ మ్యాచ్‌ను వీక్షించింది. మూడేళ్లు పూర్తి అయిన ఆ పిల్లవాడిని స్టేడియంకు తీసుకు వచ్చినట్లు హేజిల్ తన ఇన్‌స్టాలో ఓ వీడియోను పోస్టు చేసింది. ఐఎంఎల్ టీ20 లీగ్‌ను తల్లీకొడుకులు కలిసి వీక్షించారు. ఆ సమయంలో క్రికెట్ గురించి తన చిన్నారికి వివరించినట్లు ఆమె చెప్పింది. క్రికెట్ అంటే ఏంటీ, ఫోర్ ఏంటి, సిక్స్ ఏంటో చెప్పినట్లు పేర్కొన్నది.ఐఎంఎల్ టోర్నీలో ఇండియా మాస్టర్స్ జట్టు తరపున యువీ ఆడాడు. ఆ జట్టుకు సచిన్ టెండూల్కర్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. శ్రీలంక మాస్టర్స్ జట్టుకు కుమార సంగక్కర సారధ్యం వహించాడు. ఈ మ్యాచ్‌లో యువీ అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. డీప్‌లో లంక బ్యాటర్ తిరుమణే ఇచ్చిన క్యాచ్‌ను డైవ్ చేసి పట్టుకున్నాడు. ఆ మ్యాచ్లో యువీ 31 రన్స్ స్కోర్ చేశాడు. సచిన్ జట్టు 4 రన్స్ తేడాతో విజయం సాధించింది. 68 రన్స్ చేసి స్టువర్ట్ బిన్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇండియా మాస్టర్స్ 222/4 స్కోర్ చేయగా, లంకను 218/9 రన్స్‌కే నిలువరించారు.





# రోజూ ఇదో చెంచా తింటే .. చిరుత పులిలా చెలరేగిపోతారు!



అవిసె గింజలు, చిన్నవిగా కనిపించే ఈ గింజలు, ఆరోగ్యానికి చేసే మేలు మాత్రం చాలా గొప్పది. వీటిలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ఫైబర్, లిగ్నాన్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే వీటిని సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. అనేక రోగాలను తగ్గించే గుణాలు ఈ గింజల్లో ఉన్నాయి. రోజూ ఒక చెంచా అవిసె గింజల పొడిని తీసుకోవడం వలన మన శరీరానికి ఎన్నో విధాలుగా మేలు జరుగుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. దీనివల్ల రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి, రక్తపోటు నియంత్రణలో ఉంటుంది, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.! జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: అవిసె గింజలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో చాలా ముఖ్యమైనది. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది, పేగు కదలికలను సులభతరం చేస్తుంది, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాకుండా, ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన అతిగా తినడం తగ్గుతుంది, బరువు నియంత్రణలో కూడా సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: ఈ గింజలలోని ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఫైబర్ ఆహారం నుండి చక్కెరను నెమ్మదిగా రక్తప్రవాహంలోకి విడుదల చేస్తుంది, దీని వలన రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా ఉంటాయి. ఇది మధుమేహం ఉన్నవారికి లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది: అవిసె గింజలలో ఫైబర్ , ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఈ రెండూ బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన తక్కువ ఆహారం తీసుకుంటాము. ఆరోగ్యకరమైన కొవ్వులు జీవక్రియను పెంచుతాయి . కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మం , జుట్టు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి, పొడిబారకుండా చేస్తాయి . చర్మం మృదువుగా మరియు కాంతివంతంగా ఉండటానికి సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి, వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి . చర్మ వ్యాధులను నివారిస్తాయి. అలాగే, అవిసె గింజలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి, జుట్టును బలంగా , ఆరోగ్యంగా ఉంచుతాయి. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ సమస్యలను తగ్గిస్తుంది. అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు , లిగ్నాన్స్ ఉంటాయి. ఈ రెండింటికి శోథ నిరోధక లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలిక మంట అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది, అవిసె గింజలు దీన్ని నివారించడంలో సహాయపడతాయి. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారికి అవిసె గింజలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: అవిసె గింజలలో యాంటీఆక్సిడెంట్లు , పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. బలమైన రోగనిరోధక వ్యవస్థ వ్యాధులు , ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది. హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరుస్తుంది: అవిసె గింజలలో లిగ్నాన్స్ ఉంటాయి. ఇవి ఫైటోఈస్ట్రోజెన్‌లు, ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ లాగా పనిచేస్తాయి. లిగ్నాన్స్ మహిళల్లో హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి, ముఖ్యంగా రుతుక్రమం ఆగిన తర్వాత వచ్చే సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యాన్సర్ నివారణకు సహాయపడుతుంది: అవిసె గింజలలో లిగ్నాన్స్ , యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ రెండింటికి క్యాన్సర్ నివారణ లక్షణాలు ఉన్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, అవిసె గింజలు రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే, ఈ విషయంలో మరింత పరిశోధన అవసరం. ఎలా తీసుకోవాలి: అవిసె గింజల పొడిని రోజుకు ఒక చెంచా తీసుకోవడం చాలా సులభం. మీరు దీన్ని వివిధ రకాలుగా తీసుకోవచ్చు. దీనిని స్మూతీలలో కలుపుకోవచ్చు. పెరుగు లేదా ఓట్‌మీల్‌లో కలిపి తీసుకోవచ్చు. సలాడ్‌లు లేదా కూరగాయలపై చల్లుకోవచ్చు. బేకింగ్ వంటకాల్లో ఉపయోగించవచ్చు. నేరుగా నీటితో కలిపి తీసుకోవచ్చు. అయితే అవిసె గింజలను ఎప్పుడూ వేయించకుండా లేదా వేడి చేయకుండా తీసుకోవాలి. వేడి చేస్తే వాటిలోని పోషకాలు తగ్గిపోతాయి. ఈ పొడిని నిల్వ చేయడానికి గాలి చొరబడని కంటైనర్‌లో రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. అవిసె గింజల పొడిని తీసుకునేటప్పుడు తగినంత నీరు త్రాగాలి, ఎందుకంటే అవి ఫైబర్ అధికంగా కలిగి ఉంటాయి. మీరు ఏదైనా వైద్యపరమైన సమస్యలతో బాధపడుతుంటే లేదా మందులు వాడుతుంటే, అవిసె గింజల పొడిని తీసుకునే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం మంచిది.


# ఈ మసాలా దినుసులతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు!



మన నిత్యజీవితంలో ఉపయోగించే మసాలా దినుసులు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి అనే విషయం ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా తెలుసుకోవాలి. మసాలా దినుసులను మనం వివిధ రకాల వంటకాలలో సువాసనను, రుచిని పెంచడానికి ఉపయోగిస్తూ ఉంటాం. అయితే అటువంటి మసాలా దినుసులు మనకు కావాల్సిన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి .అవి మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. వాటి గురించి ప్రస్తుతం తెలుసుకుందాం. లవంగాలు లవంగాలలో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. లవంగాలు వంటల రుచిని పెంచడమే కాకుండా జలుబు, దగ్గు, పంటి నొప్పి వంటి సమస్యలకు ఎంతో బాగా పనిచేస్తాయి. లవంగాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మన జీర్ణక్రియ, అజీర్ణం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను లవంగాలు నివారిస్తాయి. యాలుకలు వివిధ వంటకాలలో ఉపయోగించే యాలకులు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. యాలుకలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రించబడుతుంది. డిప్రెషన్ ను తగ్గించడానికి యాలుకలు ఎంతో ఉపయోగపడతాయి. యాలకులు జీర్ణక్రియను మెరుగుపరిచి జీర్ణ సంబంధిత సమస్యలకు పరిష్కారంగా ఉంటాయి. ఒత్తిడిని, ఆందోళనను తగ్గించడంలో యాలుకలు ఎంత బాగా ఉపయోగపడతాయి. దాల్చిన చెక్క దాల్చిన చెక్క మనకు ఆరోగ్యాన్ని ఇవ్వడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అధిక రక్తపోటును తగ్గిస్తుంది. డయాబెటిస్ తగ్గించడానికి కూడా ఎంతగానో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్కలో మన చర్మానికి ఆరోగ్యాన్నిచ్చే గుణాలు కూడా ఉన్నాయి. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. బిర్యానీ ఆకు బిర్యానీ ఆకు మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. ఇది యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ లను నివారిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా బిర్యానీ ఆకు మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ ను ఒత్తిడిని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. కడుపునొప్పి, తలనొప్పి, జలుబు వంటి వాటికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది. బిర్యానీ ఆకులో మన శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలు ఉంటాయి.

# డయాబెటిస్ రోగులు పుచ్చకాయ తింటే ప్రాణాలకే ప్రమాదమా?

పుచ్చకాయ వేసవి కాలంలో చాలా మందికి ఇష్టమైన పండు, ఇది రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. అయితే, డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయ తినడం గురించి జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది తెలుసుకోవడానికి, పుచ్చకాయ యొక్క పోషక విలువలు, గ్లైసెమిక్ సూచిక మరియు గ్లైసెమిక్ లోడ్ గురించి తెలుసుకోవడం ముఖ్యం. పుచ్చకాయలో పోషక విలువలు: పుచ్చకాయలో నీరు ఎక్కువగా ఉంటుంది, దాదాపు 92% నీరు ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు కూడా ఉన్నాయి. దీనిలో విటమిన్ సి, ఎ, పొటాషియం, మెగ్నీషియం, లైకోపీన్ వంటి పోషకాలు ఉన్నాయి. దీనిలోని విటమిన్ ఎ రోగనిరోధక శక్తికి, చర్మ ఆరోగ్యానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్. దీనిలోని పొటాషియం రక్తపోటును నియంత్రించడానికి , గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి అవసరం. పుచ్చకాయలో ఉండే లైకోపీన్ యాంటీఆక్సిడెంట్, ఇది గుండె జబ్బులు , కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. చూస్తేనే వాంతులు ఖాయం పుచ్చకాయతో ఆరోగ్య ప్రయోజనాలు: మితంగా తిన్నప్పుడు పుచ్చకాయ డయాబెటిస్ ఉన్నవారికి కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. దీనిలో నీరు ఎక్కువగా ఉంటుంది, ఇది డయాబెటిస్ ఉన్నవారికి ముఖ్యమైనది, ఎందుకంటే వారు నిర్జలీకరణానికి గురయ్యే ప్రమాదం ఉంది. దీనిలోని విటమిన్ సి , లైకోపీన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి, ఇవి కణాలను నష్టం నుండి రక్షించడంలో సహాయపడతాయి. పుచ్చకాయలో విటమిన్ ఎ, పొటాషియం , మెగ్నీషియం వంటి విటమిన్లు , ఖనిజాలు ఉన్నాయి, ఇవి మొత్తం ఆరోగ్యానికి అవసరం. దీనిలోని ఫైబర్ తక్కువగా ఉన్నప్పటికీ, ఇది ఇప్పటికీ కొంత ఫైబర్‌ను అందిస్తుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మరియు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. । గ్లైసెమిక్ సూచిక: గ్లైసెమిక్ సూచిక (ఉఎ) అనేది ఒక ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను ఎంత త్వరగా పెంచుతుందో కొలిచే సంఖ్య. అధిక ఉఎ ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచుతాయి, అయితే తక్కువ ఉఎ ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. గ్లైసెమిక్ లోడ్ అనేది ఆహారంలోని పరిమాణం మరియు ఉఎ రెండింటినీ పరిగణలోకి తీసుకునే సంఖ్య. ఉఒ అనేది రక్తంలో చక్కెర స్థాయిలపై ఒక ఆహారం యొక్క మొత్తం ప్రభావాన్ని మరింత ఖచ్చితంగా అంచనా వేస్తుంది. డయాబెటిస్ రోగులు పుచ్చకాయ తింటే: డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది వారి వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితి , రక్తంలో చక్కెర స్థాయిలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినవచ్చు. పుచ్చకాయలో చక్కెర ఎక్కువగా ఉన్నప్పటికీ, దానిలో ఫైబర్ , నీరు కూడా ఉన్నాయి, ఇవి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి . రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగకుండా నిరోధిస్తాయి. ఇతర ఆహారాలతో కలిపితింటే?: అయితే, డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయను తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పుచ్చకాయను చిన్న భాగాలలో తినడం ముఖ్యం. ఒక కప్పు పుచ్చకాయలో దాదాపు 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. పుచ్చకాయను ప్రోటీన్ , ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఇతర ఆహారాలతో కలిపి తినడం రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. మీరు పుచ్చకాయను గింజలు, విత్తనాలు లేదా పెరుగుతో తినవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించడం: పుచ్చకాయ తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించడం ముఖ్యం, అది మీ రక్తంలో చక్కెర స్థాయిలను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవడానికి. డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయ తినడం గురించి సందేహాలు ఉంటే, వైద్యుడు లేదా డైటీషియన్‌ను సంప్రదించడం మంచిది. వారు మీ వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా సరైన సలహా ఇవ్వగలరు. డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినవచ్చు. పుచ్చకాయలో చక్కెర ఎక్కువగా ఉన్నప్పటికీ, దానిలో ఫైబర్ మరియు నీరు కూడా ఉన్నాయి, ఇవి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి . రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగకుండా నిరోధిస్తాయి. అయితే, డయాబెటిస్ ఉన్నవారు పుచ్చకాయను తినేటప్పుడు భాగం నియంత్రణను పాటించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించాలి.




# పరగడుపున ఈ నీళ్లను తాగితే... షుగర్ తో పాటు వంద రోగాలకు స్వస్తి!

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. ఆరోగ్యంగా ఉండాలి అనుకునేవారు ప్రతిరోజు మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే దినుసులను గురించి తెలుసుకొని వాటిని ఉపయోగించాలి. అలా మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే వాటిలో మెంతులు ఒకటి. మెంతులను రాత్రి నీళ్లలో నానబెట్టి తెల్లవారుజామున తాగితే అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. మెంతులు మీ డయాబెటిస్ ను కంట్రోల్ చేస్తుంది. బరువు పెరగకుండా నిరోధిస్తుంది. మీ ఆకలిని అదుపులో ఉంచుతుంది. మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. మెంతి గింజల నీటితో ఆరోగ్యం ప్రతిరోజు ఒకటి నుంచి రెండు టీ స్పూన్ల మెంతి గింజలను రాత్రిపూట నానబెట్టి పరగడుపున తాగితే మీ జీవక్రియ వేగవంతం కావడమే కాకుండా రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రించేలా చేస్తుంది. ప్రతిరోజు ఉదయం పరగడుపున మెంతి గింజల నీళ్లను తాగితే జీర్ణ క్రియ మెరుగుపడుతుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థలోని ఆహార కదలికలను ప్రోత్సహించడంతోపాటు మలబద్ధకాన్ని నివారిస్తాయి. బరువును తగ్గించే మెంతి గింజల నీళ్ళు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా డయాబెటిస్ ను కంట్రోల్ లో ఉంచుతుంది. మెంతి గింజల నీరు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది .మెంతి గింజలలో ఉండే ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి, గుండె జబ్బులను నివారించడానికి ఉపయోగపడుతుంది. మెంతి గింజల నీళ్లు మన బరువును తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. ఇది మనకు కడుపు నిండిన భావనను కలిగించి అధిక ఆహారం తీసుకోకుండా చేస్తుంది. మెంతి గింజల నీళ్లతో రోగ నిరోధక శక్తి మెంతి గింజల నీళ్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మెంతి గింజలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మొటిమలు లేదా మచ్చలను తగ్గించడంలో సహాయ పడతాయి. మెంతి గింజల నీళ్లు రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు, శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇది నొప్పులను, వాపులను తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ వంటి లక్షణాలను తగ్గించడానికి కూడా మెంతి గింజల నీళ్లు ఉపయోగపడతాయి. మెంతి గింజల నీళ్ళతో జుట్టుకు ఆరోగ్యం మెంతి గింజలు నీళ్లు గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. మహిళలలో రుతు సమస్యలను తగ్గిస్తాయి. జుట్టు పెరుగుదలకు మెంతి గింజల నీళ్లు ఉపయోగపడతాయి. మెంతి గింజలు ప్రోటీన్, నికోటినిక్ ఆమ్లానికి మంచి మూలం. ఇవి జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మెంతి గింజల నీళ్లు తాగడం వల్ల ఇది జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.











# మమత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్లో ఆమని ప్రధాన పాత్రలో శ్రీమతి మమత సమర్పించు చిత్రం 'బ్రహ్మాండ'









చిత్ర సహనిర్మాత శ్రీమతి దాసరి మమత చందు మొండేటి మాట్లాడుతూ నా సినిమా ఎంతటి ఘనవిజయం సాధించిందో ఈ సినిమా కూడా అంతటి విజయాన్ని అందుకుంటుంది ..అన్ని టీజర్ డిజైన్స్ , చూశాను . చాలా ఇంట్రెస్టింగ్ ఉన్నాయి సినిమా యూనిట్ అందరికి .. అల్ ది బెస్ట్ చెప్పారు ..నిర్మాత దాసరి సురేష్ మాట్లాడుతూ మా బ్రహ్మాండ చిత్రాన్ని చందు మొండేటి గారు టీజర్ ఆవిష్కరించిన చందు మొండేటి గారికి నేనెప్పుడూ రుణపడి ఉంటాను. చిత్ర దర్శకుడు రాంబాబు మాట్లాడుతూ మా సినిమా టీజర్ ఆవిష్కరించిన చందు మొండేటి గారికి థాంక్స్ చెప్తూ ఇది మొదటి విజయం గా భావిస్తున్నానని చెప్పారు. మొట్టమొదటిసారిగా ఒగ్గు కళాకారుల నేపథ్యంలో వారి సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న చిత్రం ఇది. ఒగ్గు కథ తెలంగాణ జానపద కళారూపం. ఒగ్గు అంటే శివుని చేతిలోని ఢమరుకం అని అర్థం. ఈ పదం కేవలం తెలంగాణ ప్రాంతంలోనే వినిపిస్తుంది. ఇది అచ్చమైన దేశీపదం. ఈ చిత్రకథ మరియు స్క్రీన్ ప్లే ప్రేక్షకులను తప్పకుండా రంజింప చేస్తుంది. యాక్షన్స్ అన్ని మరియు డివోషనల్ థ్రిల్లింగ్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ వచ్చే విధంగా ఉంటాయి. సినిమాటోగ్రాఫర్ కాసుల కార్తీక్ మాట్లాడుతూ తండెల్ డైరెక్టర్ చందు మొండేటి గారి చేతుల మీదుగా టీజర్ రిలీజ్ చేయటం చాలా ఆనందం గా ఉంది. సినిమా హీరో బన్నీ రాజు మాట్లాడుతూ నేను హీరో గా చేసిన సినిమా టీజర్ ని చందు మొండేటి గారు రిలీజ్ చేయడం చాలా ఆనందం వేసింది ఈ బ్రహ్మాండ సినిమా కూడా తండెల్ లా విజయం సాధించాలని ఆయన చేతుల మీదుగా చేయటం చాలా ఆనందంగా ఉందన్నారు ప్రేక్షక దేవుళు ్ళ ఈ సినిమా ని హిట్ చేస్తారు అని కోరుకుంటున్నానునటీనటులు : ఆమని, జయరామ్, కొమరం బన్నీ రాజ్ , కనిక వాద్య , జోగిని శ్యామల, విజయ రంగరాజు , ఆనంద్ భారతి, దిల్ రమేష్ , అమిత్ , ఛత్రపతి శేఖర్, ప్రసన్నకుమార్ ,అనంత్ కిషోర్ దాస్, , ఐడ్ల మధుసూదన్ రెడ్డి, మీసం సురేష్, దేవి శ్రీ. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ : కాసుల కార్తీక్ ఎడిటింగ్ : ఎమ్మార్ వర్మ సంగీతం : వరికుప్పల యాదగిరి మాటలు : రమేష్ రాయ్ జి ఎస్ నారాయణ .డిజైనర్ : సురేష్ బుజ్జి మేనేజర్ : శ్రీరామ్ కొరియోగ్రఫీ :కళాధర్ ,రాజు కోనేటి(రాఅఅ) ,కిరణ్.పీ ఆర్వో : శ్రీపాల్ చోల్లేటి నిర్మాత : దాసరి సురేష్ సహ నిర్మాత శ్రీమతి దాసరి మమత కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం :రాంబాబు

# బాలీవుడ్‌లో బుజ్జి తల్లి బిజీ బిజీ



నాగ చైతన్యతో కలిసి 'తండేల్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సాయి పల్లవి కొత్తగా తెలుగు సినిమాలకు కమిట్ కావడం లేదు. కోలీవుడ్‌లోనూ ఒకటి రెండు సినిమాలు మాత్రమే చేస్తుంది. కెరీర్ ఆరంభం నుంచి కూడా మెల్ల మెల్లగా సినిమాలు చేస్తూ వస్తున్న సాయి పల్లవి ఇప్పుడు కూడా అదే ఫార్ములాని ఫాలో అవుతుంది. ఇబ్బడి ముబ్బడిగా సినిమాలకు కమిట్ కావడం లేదు. ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతుంది. ప్రస్తుతం సాయి పల్లవి దృష్టి మొత్తం బాలీవుడ్ సినిమాల ఉన్నట్లు తెలుస్తోంది. సాయి పల్లవి ప్రస్తుతం హిందీ రామాయణం సినిమాలో నటిస్తుంది. సీత పాత్ర కోసం సాయి పల్లవి బల్క్ డేట్లు ఇచ్చినట్లు సమాచారం అందుతోంది. హిందీలో రామాయణం ప్రాజెక్ట్‌తో పాటు మరో సినిమాను సైతం సాయి పల్లవి కమిట్ అయింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా రూపొందుతున్న సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా ప్రకటించి చాలా కాలం అయినా జునైద్ ఖాన్ ఇతర ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటం వల్ల ఇన్నాళ్లు షూటింగ్ నత్త నడకన సాగింది. ఇటీవలే జునైద్ ఖాన్ నటించిన లవ్‌యాపా సినిమా విడుదలైంది. ఖుషీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. తమిళ్‌లో సూపర్ హిట్ అయిన సినిమాకు లవ్ యాపా రీమేక్. హిందీ ప్రేక్షకులు లవ్‌యాపా ను తిరస్కరించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అమీర్ ఖాన్ మాట్లాడుతూ... తన ప్రాజెక్ట్‌ల ఫెయిల్యూర్ కంటే లవ్ యాపా సినిమా ఫెయిల్యూర్ తనకు ఎక్కువ బాధను కలిగించిందని అన్నారు. అయితే ఆ సినిమాలో జునైద్ ఖాన్ నటనతో పాటు, స్క్రీన్ ప్రజెన్స్ బాగున్నట్లు అమీర్ ఖాన్ పేర్కొన్నాడు. అతడి ఫిల్మ్ కెరీర్ గురించి తనకు ఎలాంటి అనుమానం లేదని, భవిష్యత్తులో కచ్చితంగా మంచి స్టార్‌డం దక్కించుకుంటాడనే నమ్మకంను, విశ్వాసంను అమీర్ ఖాన్ వ్యక్తం చేశారు. కొడుకుపై తండ్రికి ఇలా నమ్మకం ఉండటం సహజం. ప్రస్తుతం జునైద్ చేస్తున్న సినిమాపై అందరిలోనూ అంచనాలు ఉన్నాయి. ఏ సినిమా చేసినా మినిమం హిట్‌ను సొంతం చేసుకుంటూ, తన నటనతో అందరినీ అలరిస్తున్న సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా కావడంతో జునైద్ ఖాన్ తదుపరి సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జునైద్ ఖాన్, సాయి పల్లవి జంట రొమాంటిక్ లవ్ స్టోరీ కోసం హిందీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హిందీలో హిట్ అయితే తెలుగు, తమిళ్‌లోనూ డబ్ అయ్యి థియేట్రికల్ రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. సాయి పల్లవి ఒక వైపు రామాయణం సినిమా షూటింగ్‌లో పాల్గొంటూనే మరోవైపు జునైద్ ఖాన్ సినిమాలోనూ సాయి పల్లవి నటిస్తోంది. మొత్తానికి బాలీవుడ్‌లో ఈ బుజ్జితల్లి బిజీ బిజీ.



# బ్లాక్ బస్టర్ గా 'డ్రాగన్'.. రూ.100 కోట్లు పక్కానా!




కోలీవుడ్ నటుడు ప్రదీప్ రంగనాథన్.. లవ్ టుడే మూవీతో తెలుగు ఆడియన్స్ కు దగ్గరైన విషయం తెలిసిందే. తన డెబ్యూ సినిమాతోనే అటు తమిళంలో.. ఇటు తెలుగులో మంచి హిట్ ను సాధించారు. తన యాక్టింగ్ తో మెప్పించారు. ఇప్పుడు రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. అశ్వత్ మారిముత్తు తెరకెక్కించిన ఆ మూవీ రీసెంట్ గా రిలీజ్ అయింది. అయితే వరల్డ్ వైడ్ గా 1500 స్క్రీన్లలో, ఇండియాలో 1000 స్క్రీన్సలో సినిమా రిలీజ్ అవ్వగా.. తమిళంలో ఏజీఎస్ సొంతంగా విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూటర్స్ గ్రాండ్ గా విడుదల చేసింది. ఇప్పుడు రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మూవీ.. బాక్సాఫీస్ వద్ద అదరగొడుతోంది. అన్ని సెంటర్స్ లో మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. తొలిరోజు రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మూవీ.. వోస్తరు వసూళ్లు రాబడుతుందని ట్రేడ్ పండితులు అంచనా వేశారు. కానీ అంచనాలు తలకిందులు చేసి రెట్టింపు వసూళ్లను రాబట్టింది. అయితే ఇప్పటివరకు వరల్డ్ వైడ్ గా బాక్సాఫీస్ వద్ద రూ.45 కోట్లు రాబట్టినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో రూ.5.5 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో వీకెండ్ కల్లా రూ.100 కోట్లు గ్రాస్ వసూళ్లు రాబట్టే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మూవీ టీమ్ కు బెస్ట్ విషెస్ చెబుతున్నారు నెటిజన్లు. నవ్విస్తూనే మంచి మెసేజ్ ఇచ్చిన మూవీ అని కొనియాడుతున్నారు. ప్రదీప్ మరిన్ని హిట్స్ కొట్టాలని ఆశిస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. యూత్ ఫుల్ లవ్ డ్రామాగా అశ్వత్ మారుముత్తు తెరకెక్కించగా.. ఏజీఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై కళాపతి నిర్మించారు. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్, కాయదు లోహర్ ఫిమేల్ లీడ్ రోల్స్ లో నటించారు. ప్రముఖ దర్శకులు కేఎస్ రవికుమార్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ నటించారు. నటి స్నేహ గెస్ట్ రోల్ లో మెరిశారు. జార్జ్ మార్యన్, ఇందుమతి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. లియోన్ జేమ్స్ మ్యూజిక్ అందించగా.. సినిమాటోగ్రాఫర్ గా నికేత్ బొమ్మిరెడ్డి వ్యవహరించారు. ప్రదీప్ ఈ రాఘవ్ ఎడిటింగ్ బాధ్యతలు చూసుకున్నారు. మొత్తానికి రూ.40 కోట్ల బడ్జెట్ తో రూపొందిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మూవీ అందరినీ ఓ రేంజ్ లో మెప్పిస్తోంది. మరి మీరు చూశారా?

# విలన్లకే భయం పుట్టించే అర్జున్ సర్కార్ అర్జున్ సర్కార్

నేచురల్ స్టార్ నాని ప్రతీ సినిమాతో కూడా డిఫరెంట్ కంటెంట్ తో సర్ ప్రైజ్ చేస్తున్నాడు. ఎలాంటి సినిమా చేసినా కూడా అందులో ఏదో ఒక కొత్త పాయింట్ ఉండాల్సిందే. అయితే ఈసారి హిట్ 3లో నాని ఎంచుకున్న పాత్ర ఊహాలకందని ఊచకోత తరహాలో ఉన్నట్లు అనిపిస్తోంది. అర్జున్ సర్కార్ అనే పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా, నాని తన అగ్రెసివ్ యాటిట్యూడ్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అతని లుక్, బాడీ లాంగ్వేజ్, ఎక్స్‌ప్రెషన్స్ మొత్తం కొత్తగా ఉన్నాయి. నేడు నాని పుట్టినరోజు సందర్భంగా రిలీజైన టీజర్‌లో నాని ఊచకోత అంటే ఏంటో చూపించాడు. కాశ్మీర్ బ్యాక్ డ్రాప్స్, టెర్రర్ అలాగే మర్డర్ మిస్టరీ లాంటి అంశాలు గట్టిగానే ఉన్నట్లు అర్థమవుతుంది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి హిట్ సిరీస్ ను యాక్షన్ బ్యాక్ డ్రాప్ గట్టిగానే ప్లాన్ చేసినట్లు అర్థమవుతుంది. ఇక అతని లాటికి దొరికితే విలన్స్ కు కష్టమే అన్నట్లు క్యారెక్టర్ ను హైలెట్ చేశారు. మొదటి సారి చూసిన వెంటనే, నాని స్క్రీన్ ప్రెజెన్స్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉందో స్పష్టంగా తెలుస్తోంది. తెల్లటి సూట్, బ్లాక్ బో టై, చేతిలో రక్తం అంటిన కత్తి ఈ లుక్ చూసినవాళ్లలో వణుకు పుట్టించేలా ఉంది. నాని ఈ సినిమాలో విలన్లను తరిమికొట్టడమే కాదు, వాళ్లు అనుకున్నది కన్నా పదింతలు భయంకరంగా బదులిచ్చే పోలీస్‌గా మారాడు. టీజర్‌లో నాని వేసే ప్రతి స్టెప్, చూపించే ప్రతి ఎక్స్‌ప్రెషన్ ఒక రేంజ్‌లో ఉంది. ప్రత్యేకంగా ఫైట్ సీక్వెన్స్ అయితే ఈ సినిమాలో హైలైట్‌గా నిలిచేలా ఉంది. నాని ఈ రేంజ్‌లో యాక్షన్ చేయడం, విలన్లను చూస్తూ సరిగ్గా స్మైల్ ఇస్తూ దాడి చేయడం, టీజర్ మొత్తాన్ని హై ఓల్టేజ్ స్థాయిలో ఉంచింది. హిట్ 3 కేవలం ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ మాత్రమే కాదు, ఒక బ్రూటల్ యాక్షన్ మూవీ అని చెప్పకనే చెప్పింది. హిట్ ఫ్రాంచైజ్‌లో ఇదే మోస్ట్ వయలెంట్ చాప్టర్ అని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత హార్డ్ హిట్టింగ్‌గా తీసుకువచ్చినట్లు అర్థమవుతోంది. హిట్ 1, 2లతో పోలిస్తే, ఈ సినిమాలో యాక్షన్ కూడా డబుల్ అయింది. ఒక కేసును చేదించడంలో అర్జున్ సర్కార్ ఎంతవరకు వెళ్తాడో, ఎంత కఠినంగా వ్యవహరిస్తాడో టీజర్ చూపిస్తోంది.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**